ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 168 శనివారం 06 - 06 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-
Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 168 Saturday 06 - 06 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-



## హైదరాబాద్ జనాభా కోటిన్నర!

- ఇప్పటివరకు లెక్క
- హైదరాబాద్ మొదటి దశ జనగణనలో 1.3 కోట్ల మంది
- తాళం వేసిన 5.42 శాతం ఇళ్లకు రీ సర్వే
- ఈ నెల 9న పూర్తికానున్న గడువు

**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 05 :**
తెలంగాణ ప్రభుత్వం 2010 నాటి జనాభా లెక్కలు, ఓటర్ల సంఖ్యను ఆధారంగా చేసుకుని ఓఆర్ఆర్ పరిధిలో 1.34 కోట్ల మంది ఉంటారని అంచనా వేసింది. కానీ ఇపుడు ఆ అంచనాలు దాటిపోయి గణాంకాలు - మిగతా 2 లో

# హైదరాబాద్‌లో ఎబోలా కలకలం

- గాంధీ ఆసుపత్రిలో ముగ్గురు అనుమానితులు
- ఒకే అంతర్జాతీయ విమానంలో ప్రయాణించిన ముగ్గురిలో లక్షణాలు
- సూడాన్ నుంచి వచ్చిన ప్రయాణికుడికి ఎయిర్‌పోర్ట్‌లోనే గుర్తింపు
- నిర్ధారణ కోసం నమూనాలను పూణె వైరాలజీ ల్యాబ్‌కు పంపిన అధికారులు
- ఆందోళన వద్దని, అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖ వెల్లడి




**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 05 :**
భాగ్యనగరంలో ఎబోలా వైరస్ కలకలం రేపుతోంది. ఎబోలా తరహా లక్షణాలతో ముగ్గురు వ్యక్తులు సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామంతో అప్రమత్తమైన తెలంగాణ ఆరోగ్య శాఖాధికారులు, బాధితులను ప్రత్యేక ఐసోలేషన్ వార్డుకు తరలించి వైద్యుల నిరంతర పర్యవేక్షణలో ఉంచారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం ఉదయం ఎబోలా ప్రాథమిక లక్షణాలతో ఇద్దరు వ్యక్తులు జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిని ఆశ్రయించారు. పరిస్థితిని గమనించిన వైద్యులు వారిని తక్షణమే గాంధీ ఆసుపత్రికి రిఫర్ చేశారు. దీంతో గాంధీలో చేరిన ఎబోలా అనుమానితుల సంఖ్య మూడుకు చేరుకుంది. ప్రాథమిక దర్యాప్తులో ఈ ముగ్గురు - మిగతా 2 లో

## ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోం



- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఏపీతో చర్చలు జరుగుతున్నాయి
- పాలమూరు ప్రాజెక్టును సందర్శించిన రేవంత్ రెడ్డి
- ఏపీతో సమస్యల పరిష్కారికే ప్రాధాన్యత ఇస్తామని వెల్లడి
- బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లా నిర్లక్ష్యానికి గురైందని విమర్శ

**వార్త సంధ్య, హైదరాబాద్, జూన్ 05 :**
పాలమూరు ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా, గోదావరి జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త చెబుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఏపీతో చర్చలు జరిపినా రాష్ట్ర చట్టబద్ధమైన వాటాలో ఒక్క చుక్క నీటిని - మిగతా 2 లో

## బంగాల్, బిహార్, త్రిపురల్లో జనాభా మార్పులను సహించబోం



- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- దేశ సరిహద్దుల రక్షణలో ఉన్న లోపాలను అధిగమించడానికి, సరిహద్దుల భద్రతను కట్టుదిట్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- స్మార్ట్ బోర్డర్ ప్రాజెక్ట్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుంది

**వార్త సంధ్య,ఢిల్లీ, జూన్ 05 :**
బంగాల్, త్రిపుర, బిహార్‌లలో అక్రమ వలసల కారణంగా జరుగుతున్న జనాభా మార్పులను కేంద్ర ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లో సహించబోదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశ సరిహద్దుల రక్షణలో - మిగతా 2 లో

## శాఖ నచ్చలేదని కర్ణాటక మంత్రి రాజీనామా

- డీకే శివకుమార్‌కు షాక్..
- మంత్రిపదవికి రామలింగారెడ్డి రాజీనామా
- బెంగళూరు అభివృద్ధి శాఖ దక్కకపోవడంతో అసంతృప్తి
- డీకే శివకుమార్ మాట తప్పారని ఆరోపణ
- కెమెరా ముందే రాజీనామా లేఖపై సంతకం
- ఎమ్మెల్యేగా కొనసాగుతానని ప్రకటన

2 లో



## వైఎస్ షర్మిలకు దక్కని రాజ్యసభ టికెట్ !

- షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయబోతున్నారంటూ కొన్ని రోజులుగా ప్రచారం
- కర్ణాటక నుంచి మూడు స్థానాలను ప్రకటించిన పార్టీ అధిష్ఠానం
- షర్మిలకు టికెట్ దక్కకపోవడంతో అభిమానుల నిరాశ

**వార్త సంధ్య, అమరావతి, జూన్ 05 :**
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల కర్ణాటక నుంచి రాజ్యసభకు పోటీ చేయబోతున్నారంటూ గత కొన్ని రోజులుగా జోరుగా సాగిన ఊహాగానాలకు తెరపడింది. కాంగ్రెస్ అధిష్ఠానం తాజాగా ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థుల తుది జాబితాలో షర్మిలకు చోటు దక్కలేదు. కర్ణాటక నుంచి ఖాళీగా ఉన్న మూడు రాజ్యసభ స్థానాలను భర్తీ చేసే క్రమంలో.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. - మిగతా 2 లో





2 లో

## బీజేపీకి అన్నామలై రాజీనామా

- ఆమోదించిన అధిష్ఠానం
- అధికారికంగా ప్రకటించిన నితిన్ నబీన్
- బుజ్జగించేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలం
- కొత్త ప్రాంతీయ పార్టీ పెట్టేందుకు యోచన
- పొత్తుల విషయంలో విభేదాల వల్లే రాజీనామా
- తమిళనాడు బీజేపీకి ఇది పెద్ద ఎదురుదెబ్బ



2 లో

## మనుషులపైనే తిరగబడనున్న ఏఐ!

- నిజం కాబోతున్న 'రోబో' సినిమా
- మనుషుల నియంత్రణను ఏఐ దాటొచ్చని ఆంత్రోపిక్
- తమను తామే అభివృద్ధి చేసుకుంటున్న ఏఐ
- క్లాడ్ సొంతంగానే 80 శాతం కోడింగ్ రాసినట్లు వెల్లడి
- ఏఐ అభివృద్ధిని తాత్కాలికంగా ఆపాలని ప్రతిపాదన

# సైకిల్ తొక్కితే ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ఎంతో మేలు

- విశాఖలో సైక్లింగ్, వాకింగ్ కోసం ప్రత్యేక మార్గాలు
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖలో నెట్ జీరో కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- విశాఖలో "వర్సిటీకి కావాల్సిన కరెంటును 100 శాతం ఇక్కడే ఉత్పత్తి చేసుకోవాలి
- సైక్లింగ్, వాకింగ్ కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేస్తామన్న సీఎం
- చెట్లు లేని ఖాళీ స్థలాలు, భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలి
- హైదరాబాద్ తరహాలో ఇక్కడ కూడా పచ్చదనం అభివృద్ధి చేయాలి



**వార్త సంధ్య, విశాఖపట్నం , జూన్ 05 :**
ప్రతిరోజూ సైకిల్ తొక్కితే ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖలో నెట్ జీరో కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఏయూ నుంచి నోవాటెల్ హోటల్ వరకూ సైకిల్ తొక్కారు. కాలుష్య రహిత వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఈ సందర్భంగా చంద్రబాబు పిలుపునిచ్చారు. విశాఖలో సైక్లింగ్, వాకింగ్ కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విశాఖ ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో సీఎం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ "వర్సిటీకి కావాల్సిన కరెంటును 100 శాతం ఇక్కడే ఉత్పత్తి చేసుకోవాలి. చెట్లు లేని ఖాళీ స్థలాలు, భవనాలపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు - మిగతా 2 లో

# మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించాలి

- ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేళ పవన్ కల్యాణ్ పిలుపు
- సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమంలో పాల్గొన్న పవన్
- సీడ్ బాల్స్ తయారుచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన పవన్
- 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారు చేయడమే లక్ష్యం
- కొండపల్లి సమీపంలోని మూలపాడు బటర్‌ఫ్లై పార్కుకు ఉపముఖ్యమంత్రి
- తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ మొక్క నాటిన వైనం



**వార్త సంధ్య, అమరావతి, జూన్ 05 :**
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక వినూత్నమైన, అర్థవంతమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అటు పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ఇస్తూనే... ఇటు ఒక భావోద్వేగపూరితమైన వ్యక్తిగత స్పర్శతో ఆయన తీసుకున్న నిర్ణయం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. ఎన్టీఆర్ జిల్లాలోని మూలపాడు 'బటర్ ఫ్లై పార్క్' (సీతాకోకచిలుకల పార్క్)ను సందర్శించిన పవన్ కళ్యాణ్... అక్కడ ఎంతో అరుదైన, సాంస్కృతిక ప్రాధాన్యత కలిగిన 'తెల్ల పొనికి' మొక్కను నాటారు. ప్రపంచప్రసిద్ధి చెందిన - మిగతా 2 లో

# సంపాదకీయం

## కల్లుగీత వృత్తిని ఆధునికీకరించాలి



పెట్టుబడిదారీ విధానం, కార్పొరేట్ శక్తుల విస్తరణ కారణంగా నేడు గ్రామీణ ప్రాంతాల్లోని అనేక సంప్రదాయ వృత్తులు తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. చేనేత, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, కంసాలి వంటి వృత్తులపై కార్పొరేట్ శక్తుల ప్రభావం పడటంతో, ఆయా రంగాల వారు ఉపాధి కోల్పోయి కంపెనీలలో దినసరి కార్మికులుగా మారుతున్నారు. నేడు ఇదే పరిస్థితి క్రమంగా కల్లుగీత వృత్తికి కూడా విస్తరిస్తోంది. సరైన ఆదాయం లేకపోవడం, వృత్తి పట్ల సామాజిక గౌరవం తగ్గడం, ప్రమాదాల బారిన పడటం, అమ్మకాలపై ఉన్న ఆంక్షల కారణంగా గీత కార్మికుల సంఖ్య రోజురోజుకూ క్షీణిస్తోంది.తెలంగాణలో ప్రకృతి సిద్ధంగా పెరిగిన తాటి, ఈత చెట్లు దాదాపు ఒక కోటి వరకు ఉన్నాయి. ఇవి పర్యావరణాన్ని పరిరక్షించడమే కాకుండా, లక్షలాది మంది గీత కార్మికులకు జీవనోపాధిని కల్పిస్తున్నాయి. ఎలాంటి రసాయనాలు, కృత్రిమ ప్రక్రియలు లేకుండా స్థానిక వృత్తిదారులు సేకరించే ఏకైక సహజ పానీయం కల్లు. నాటి గ్రామీణ ప్రాంతాల్లో శ్రమజీవుల అలసటను తీర్చేందుకు ఈ ప్రకృతి పానీయం ఎంతో దోహదపడింది. మన సంస్కృతిలో అంతర్భా గమైంది.గ్రామాల్లోకి సారాయి, వైన్ షాపుల ప్రవేశంతో కల్లుగీత వృత్తిపై తీవ్ర ప్రభావం పడింది. రాష్ట్ర ప్రభుత్వాలు ఖజానాను నింపుకోవడమే లక్ష్యంగా ఎక్సైజ్‌శాఖ ద్వారా బెల్టు షాపులను ప్రోత్సహిస్తూ, లిక్కర్ విక్రయాలను పెంచుతున్నాయి. దీనికి తోడు, బహుళజాతి కంపెనీల ఉత్పత్తులైన పలు సాఫ్ట్ డ్రింక్స్, ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఫలితంగా మన సహజ పానీయం అమ్మకాలు పడిపోయాయి. ఆరోగ్యానికి హానిచేసే ఆయా రసాయన పానీయాలను సేవించి ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు.కరోనా మహమ్మారి తర్వాత ప్రజలు ఆర్గానిక్, సహజ సిద్ధమైన ఉత్పత్తులను వాడేందుకు మొగ్గుచూపుతున్నారు. శాస్త్రీయంగా చూస్తే ఒక్క తాడి చెట్టు 100 వాటర్ ఫిల్టర్లతో సమానం. రాష్ట్రంలో ఉన్న ఒక కోటి చెట్లలో ప్రస్తుతం కేవలం 20శాతం మాత్రమే వినియోగంలో ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సుమారు 80 లక్షల లీటర్ల ఉత్పత్తి జరుగుతూ, 40 కోట్ల రూపాయల ఆదాయం లభిస్తోంది. కానీ మిగిలిన 80శాతం వృక్ష సంపద ఎలాంటి వినియోగం లేక వృథాగా ఉంది.కల్లును కేవలం దిగువ తరగతుల పానీయంగా చూసే అపోహలను, అపరిశుభ్రమైనదనే ముద్రను తొలగించాలి. పర్యాటక ప్రాంతాల్లో సంప్రదాయ ఆహార పానీయాల జాబితాలో దీనికి సముచిత స్థానం కల్పించాలి. 'నీరా'ను ఒక బ్రాండెడ్ సాఫ్ట్ డ్రింక్‌గా మార్చి, దాని అమ్మకాలను సరళీకరించాలి. రెస్టారెంట్లు, శీతల పానీయాల దుకాణాలు, సూపర్ మార్కెట్లలో ఇది లభ్యమైతే కచ్చితంగా ఇదొక ట్రెండ్ సృష్టిస్తుంది. ఈ వృత్తిని నమ్ముకున్న లక్షలాది మందికి ఉపాధి కల్పించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రభుత్వం తక్షణమే ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలి.'నీరా'తో పాటు తాటిబెల్లం, చక్కెర వంటి అనుబంధ ఉత్పత్తులను పెద్ద ఎత్తున మార్కెట్లోకి తేవాలి. కల్లు, నీరా సేకరణలో చెట్లు ఎక్కేందుకు సురక్షితమైన పరికరాలు, నిల్వ ఉంచేందుకు శీతలీకరణ (కోల్డ్ స్టోరేజ్) వంటి ఆధునిక పద్ధతులు అవలంబించాలి. గీత కార్మికుల భద్రత దృష్ట్యా తక్కువ ఎత్తు ఉండి, ఎక్కువ ఉత్పత్తినిచ్చే హైబ్రిడ్ రకం తాటి, ఈత చెట్లను పెంచేలా రీసెర్చ్ విభాగాలు పనిచేయాలి. ప్రకృతి మనకిచ్చిన ఈ గొప్ప సంపదను సద్వినియోగం చేసుకుంటే అటు కార్మికులకు ఉపాధి, ఇటు ప్రజలకు ఆరోగ్యం చేకూరతాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ వృత్తిని ఆధునికీకరించి, పూర్వ వైభవం తీసుకురావాలి.

## వైఎస్ షర్మిలకు దక్కని రాజ్యసభ టికెట్ !

**మొదటిపేజీ తరువాయి - కర్ణాటక కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థులు వీరే:**

మల్లికార్జున్ ఖర్గే: కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు

పవన్ ఖేడా: ఏఐసీసీ జాతీయ అధికార ప్రతినిధి.

మన్సూర్ ఆలీ ఖాన్: కేంద్ర మాజీ మంత్రి రెహ్మాన్ ఖాన్ కుమారుడు.

మల్లికార్జున్ ఖర్గే ఈరోజు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మాజీ సీఎం సిద్ధరామయ్య సహా పలువురు కీలక నేతలు హాజరుకానున్నారు. మరోవైపు, రాజ్యసభ ద్వారా పార్లమెంట్‌లో అడుగుపెట్టాలనుకున్న షర్మిలకు ఈసారి టికెట్ దక్కకపోవడంతో ఆమె అనుచరులు, కాంగ్రెస్ అభిమానులు తీవ్ర నిరాశకు లోనయ్యారు.

## బీజేపీకి అన్నామలై రాజీనామా

**మొదటిపేజీ తరువాయి -** కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి తెరదించుతూ తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఢిల్లీలో బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి ఆయన తన రాజీనామా లేఖను సమర్పించారు. అధిష్ఠానం దాన్ని ఆమోదించింది. అన్నామలై పార్టీలోనే కొనసాగేలా చూసేందుకు బీజేపీ అగ్రనాయకత్వం చివరి నిమిషం వరకు యత్నించింది. అయినప్పటికీ ఆయన మాత్రం తన నిర్ణయానికే మొగ్గు చూపారు.తమిళనాడులో సొంతంగా బలాన్ని పెంచుకోకుండా ఏఐఏడీఎంకేతో పొత్తు పెట్టుకోవాలనే కేంద్ర నాయకత్వ వ్యూహాలపై అన్నామలై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆయన త్వరలోనే 'తమిళ్ ఫస్ట్' అనే నినాదంతో ఓ సరికొత్త ప్రాంతీయ పార్టీని పెట్టబోతున్నట్లు సన్నిహిత వర్గాలు చెబున్నాయి. మాజీ ఐపీఎస్ అధికారి అయిన అన్నామలై నిష్క్రమణ తమిళనాడులో బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బగా మారనుంది. దూకుడుగా సాగించిన ప్రచారం, ప్రత్యర్థులపై చేసిన పదునైన విమర్శలే ఆ రాష్ట్రంలో బీజేపీని ఒక బలమైన శక్తిగా నిలబెట్టాయని నిపుణులు చెబుతున్నారు.

## బంగాల్, బిహార్, త్రిపురల్లో జనాభా మార్పులను సహించబోం

**మొదటిపేజీ తరువాయి -** ఉన్న లోపాలను అధిగమించడానికి, భద్రతను కట్టుదిట్టం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. శుక్రవారం త్రిపురలోని లంకాముర సరిహద్దు అవుట్‌పోస్ట్‌లో బీఎస్ఎఫ్ సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'స్మార్ట్ బోర్డర్' ప్రాజెక్టుపై కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల భద్రతను ఆధునీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "స్మార్ట్ బోర్డర్" ప్రాజెక్ట్ ప్రస్తుతం చివరి దశకు చేరుకుందని అమిత్ షా ప్రకటించారు. ఈ సరికొత్త విధానాన్ని దేశవ్యాప్తంగా మొదటగా ఏడు నుంచి ఎనిమిది ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్త భద్రతా వ్యవస్థలో అత్యాధునిక సాంకేతికత, స్థానిక పరిపాలన, సరిహద్దు కాపలాదారులు ఉంటారని పేర్కొన్నారు.

## ఒక్క చుక్క నీటిని కూడా వదులుకోం



**మొదటిపేజీ తరువాయి -** కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాము 'పంచాయతీ' కంటే 'పరిష్కారానికే' ప్రాధాన్యత ఇస్తామని... పాలమూరు, డిండి పెండింగ్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ వస్తేనే మిగతా చర్చలు ముందుకు సాగుతాయని తేల్చి చెప్పారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని సీఎం మండిపడ్డారు. గత ప్రభుత్వం కనీసం భూసేకరణ పనులను కూడా పూర్తి చేయకపోవడం వల్లే ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. కష్టకాలంలో కేసీఆర్‌ను ఆదుకున్న పాలమూరును అధికారంలోకి వచ్చాక ఆయన పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. వలసల జిల్లా అయిన పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు.

# సైకిల్ తొక్కితే ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి ఎంతో మేలు

**మొదటిపేజీ తరువాయి -** చేయాలి. ఇప్పటికే రూ.5,18,000 విలువైన విద్యుత్ ఆదా అయింది. తిరుమల తరహాలో క్యాంపస్ మొత్తాన్ని పచ్చదనంతో నింపాలి. ప్రపంచంలోని వివిధ రకాల మొక్కలను తీసుకొచ్చి ఇక్కడ నాటాలి" అని సీఎం చంద్రబాబు అన్నారు."పెరుగుతున్న ఎండలు, వాతావరణ మార్పులను తట్టుకునేలా చేయాలి. హైదరాబాద్ తరహాలో ఇక్కడ కూడా పచ్చదనం అభివృద్ధి చేయాలి. హాస్టళ్లు, కాలేజీల నుంచి వచ్చే తడి చెత్త, ఆకులను కంపోస్టుగా మార్చాలి. వ్యర్థాల నుంచి బయోగ్యాస్ తయారు చేసి వంట గదులకు ఉపయోగించాలి. రీసైక్లింగ్‌కు పనికొచ్చే వ్యర్థాలను వేరు చేసి పంపాలి. దేనికీ పనికిరాని చెత్త కోసం 'వేస్ట్ టు ఎనర్జీ' ప్లాంట్ ఉపయోగించాలి. మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలి. క్యాంపస్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు పోకూడదు. శుద్ధి చేసిన నీటిని చెట్లకు ఉపయోగించాలి" అని సీఎం చంద్రబాబు సూచించారు.పైప్‌ల ద్వారా వచ్చే గ్యాస్‌తో వంటలు చేయాలి. వంటల కోసం ఎలక్ట్రిక్ స్టవ్‌లు లేదా పీఎన్‌జీ గ్యాస్ మాత్రమే వాడాలి. ప్రొఫెసర్లు, నిపుణులతో కూడిన కమిటీ వేసి ఇన్-హౌస్ నాలెడ్జ్ ఉపయోగించుకోవాలి. ప్రతి విద్యార్థి ఐడియాలను



తీసుకుని యాక్షన్ ప్లాన్‌లో భాగస్వామ్యం చేయాలి. ప్రపంచంలోనే టాప్ 10 లేదా టాప్ 20 నాలెడ్జ్ యూనివర్సిటీల సరసన ఏయూను నిలపాలి. క్యాంపస్ లోపల ఎలక్ట్రికల్ సైకిళ్లను అందుబాటులోకి తేవాలి. సైక్లింగ్ ద్వారా కాలుష్యం తగ్గడమే కాకుండా ఫిట్‌నెస్ పెరుగుతుంది" అని సీఎం సూచించారు. అనంతరం నెట్ జీరో కార్యక్రమంలో భాగంగా ఏయూ నుంచి నోవాటెల్ వరకు సీఎం చంద్రబాబు సైకిల్‌పై ప్రయాణించారు.రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం సాధించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఆ స్ఫూర్తితో పనిచేస్తే రాష్ట్రంలో వాతావరణ సమతుల్యత సాధించవచ్చన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా విశాఖ ఆంధ్ర వర్సిటీ మైదానంలో ముఖ్యమంత్రి మొక్క నాటారు. తిరుమలకు వెళ్తే మనసుకు ఎంత ప్రశాంతత లభిస్తుందో, ఆంధ్ర వర్సిటీ క్యాంపస్‌కు వచ్చినా అలాంటి అనుభూతి కలిగేలా తయారు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఆ పరిస్థితి రావాలంటే పచ్చదనం పెంపే ఏకైక మార్గమన్నారు. అదే సమయంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి, చెత్త నుంచి సంపద సృష్టితో పర్యావరణ పరిరక్షణ, ఆదాయార్జన సాధ్యమవుతాయని సీఎం అన్నారు.విశాఖలోని ఏయూ నుంచి నోవాటెల్ హోటల్ వరకు ఐదున్నర కిలోమీటర్ల దూరాన్ని 21.18 నిమిషాల్లో చంద్రబాబు చేరుకున్నారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు చేరుకున్నారు. ఎండత తీవ్రత ఎక్కువగా ఉన్నా లెక్కచేయకుండా ప్రజలకు అభివాదం చేస్తూ సైకిల్‌పై ముందుకు సాగారు. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు డీబీవీ స్వామి, జిల్లా ప్రజాప్రతినిధులు అధికారులు ఉన్నారు.

# మనుషులపైనే తిరగబడనున్న ఏఐ!


**మొదటిపేజీ తరువాయి -** సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'రోబో' సినిమాలో వశీకరణ్ సృష్టించిన చిట్టి.. తనను తాను అప్‌గ్రేడ్ చేసుకుని, మనుషులపైనే ఎదురుతిరిగి విధ్వంసం సృష్టిస్తుంది. సరిగ్గా అలాంటి సైన్స్ ఫిక్షన్ సినిమా సీనే ఇప్పుడు నిజం కాబోతోందంటూ ప్రముఖ ఏఐ సంస్థ 'ఆంత్రోపిక్' సంచలన హెచ్చరిక చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత భవిష్యత్తులో మనుషుల నియంత్రణను దాటిపోయే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది.క్లాడ్ ఏఐ చాట్‌బాట్‌ను రూపొందించిన ఈ సంస్థ.. భవిష్యత్తులో ఏఐ వ్యవస్థలు తమకు తామే మరింత శక్తిమంతమైన కొత్త రూపాలను సృష్టించుకునే స్థాయికి చేరుకుంటున్నాయని తెలిపింది. దీన్నే సాంకేతిక భాషలో 'రికర్సివ్ సెల్ఫ్ ఇంప్రూవ్‌మెంట్' అని పిలుస్తారు. సినిమాలో చిట్టి రోబో తనలాంటి వందలాది రోబోలను తయారు చేసుకున్నట్లే.. నిజ జీవితంలోనూ ఏఐ మనుషుల ప్రమేయం లేకుండా తన తర్వాతి తరాన్ని సృష్టించుకోగలదని పేర్కొంది.ప్రస్తుత 2026 మే నెల నాటికే తమ సాఫ్ట్‌వేర్ కోడ్ బేస్‌లో ఏకంగా 80 శాతానికి పైగా కోడింగ్‌ను మనుషులు కాకుండా క్లాడ్ ఏఐ మాత్రమే స్వయంగా రాసిందని సంస్థ వెల్లడించింది. ఈ పరిణామం సైన్స్, వైద్య రంగాలకు ఎంతో మేలు చేసినప్పటికీ.. నియంత్రణ కోల్పోతే ఊహించని ముప్పు తెస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ వేగవంతమైన మార్పుల నేపథ్యంలో ప్రపంచంలోని అన్ని ప్రముఖ టెక్నాలజీ సంస్థలు కలిసి ఏఐ అభివృద్ధిని కొన్నాళ్ల పాటు 'తాత్కాలికంగా నిలిపివేయాలని' ఆంత్రోపిక్ ప్రతిపాదించింది.టెక్నాలజీ కంటే సమాజం, భద్రతా పరిశోధనలు వెనుకబడిపోకుండా ఉండటానికే ఈ విరామం అవసరమని ఆంత్రోపిక్ స్పష్టం చేసింది. అయితే తీవ్రమైన పోటీ ఉన్న ఈ తరుణంలో అన్ని సంస్థలను ఒప్పించి ఏఐ పరిశోధనలను ఆపడం ప్రాక్టికల్‌గా చాలా కష్టమని పలువురు



నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు కొందరు మాత్రం ఈ భయాలను కొట్టిపారేస్తున్నారు. సినిమాలో చూపించినట్లు మనుషుల ఉనికికే ముప్పు వస్తే గనుక మనుషులు ఎప్పుడైనా ఏఐ ప్లగ్‌ను లాగేసి దాన్ని ఆపొచ్చని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# శాఖ నచ్చలేదని కర్ణాటక మంత్రి రాజీనామా

**మొదటిపేజీ తరువాయి -** ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం చేసి మంత్రిమండలి ఏర్పడిన కొన్నిరోజులకే కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర అసమ్మతి జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ఆశించిన మంత్రిత్వ శాఖ దక్కలేదనే అసంతృప్తితో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మంత్రి రామలింగారెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన 'బెంగళూరు నగరాభివృద్ధి' శాఖను కేటాయించకపోవడమే ఆయన కఠిన నిర్ణయానికి కారణమని సమాచారం. కెమెరాల ముందే తన రాజీనామా లేఖపై సంతకం చేసిన ఆయన.. దాన్ని విలేకరులకు చూపిస్తూ తన అసంతృప్తిని పంచుకున్నారు.ముఖ్యమంత్రి అయిన తర్వాత బెంగళూరు అభివృద్ధి శాఖను తనకు అప్పగిస్తానని డీకే శివకుమార్ గతంలో ఇంటికి వచ్చి మరీ మాటిచ్చారని రామలింగారెడ్డి మీడియా ముందు చెప్పారు. ప్రమాణ స్వీకారానికి ముందు రోజు కూడా డీకేఎస్‌ను కలిసినప్పుడు ఇదే శాఖ ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ ఇప్పుడు మాట తప్పారని ఆరోపించారు. తనకు జరిగిన ఈ అవమానంతో నిరాశకు గురయ్యానని, అందుకే మంత్రి పదవిని వదులుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అయితే తాను



కేవలం మంత్రి పదవికి మాత్రమే రాజీనామా చేస్తున్నానని, కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ ఎమ్మెల్యేగా కొనసాగుతానని స్పష్టం చేశారు. ఈ విషయంలో తనకు సిద్ధరామయ్యపై గానీ, శివకుమార్‌పై గానీ ఎలాంటి వ్యక్తిగత కోపం లేదన్నారు.ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీనియర్ నేత రామలింగారెడ్డి.. బెంగళూరు అభివృద్ధి శాఖ మినహా మరే ఇతర శాఖను తీసుకోనని ముందే తేల్చి చెప్పారు. అయినప్పటికీ ఆయనకు 'భారీ, మధ్య తరహా నీటిపారుదల' శాఖను కేటాయించడంతో ఈ వివాదం మొదలైంది. గతంలో సిద్ధరామయ్య ప్రభుత్వంలో రవాణా, హోం శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన.. తన రాజీనామా లేఖను స్వయంగా సీఎంకు ఇవ్వకుండా ఓ వ్యక్తి ద్వారా ప్రధాన కార్యదర్శికి పంపారు. బెంగళూరు అభివృద్ధి శాఖను కృష్ణ బైరేగౌడకు కేటాయించడమే ఈ మొత్తం రాజీనామా డ్రామాకు కారణమైంది.

## హైదరాబాద్‌లో ఎబోలా కలకలం




**మొదటిపేజీ తరువాయి -** ఒకే అంతర్జాతీయ విమానంలో హైదరాబాద్‌కు చేరుకున్నట్లు వెల్లడి కావడంతో, సదరు విమానంలో ప్రయాణించిన ఇతర ప్రయాణికుల వివరాలను సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.కాగా, అంతకుముందు గురువారం నాడు సూడాన్ నుంచి ఇథియోపియా మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న 30 ఏళ్ల వ్యక్తిని విమానాశ్రయ వైద్య బృందం గుర్తించింది. థర్మల్ స్క్రీనింగ్‌లో అతనికి 100 డిగ్రీల జ్వరం ఉన్నట్లు తేలింది. ఇటీవల ఎబోలా ప్రభావిత దేశాలైన ఉగాండా, దక్షిణ సూడాన్‌లలో అతడు పర్యటించినట్లు సమాచారం అందడంతో, అధికారులు ముందుజాగ్రత్తగా అతడిని గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు.ప్రస్తుతం ఆ ముగ్గురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, ఎబోలా తీవ్రతను సూచించే రక్తస్రావం, వాంతులు వంటి లక్షణాలు ప్రస్తుతానికి ఎవరిలోనూ కనిపించడం లేదని వైద్యులు స్పష్టం చేశారు. బాధితుల నుంచి సేకరించిన నమూనాలను తుది నిర్ధారణ పరీక్షల నిమిత్తం పూణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (చీ×ం)కి పంపారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆరోగ్య శాఖాధికారులు భరోసా ఇచ్చారు. పూణె నుంచి వచ్చే నివేదికల ఆధారంగా తదుపరి కార్యాచరణ ఉంటుందని వారు వెల్లడించారు.

## మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించాలి



**మొదటిపేజీ తరువాయి -** కొండపల్లి బొమ్మల తయారీకి ఈ తెల్ల పొనికి కర్రనే ఉపయోగిస్తారు. ఈ అరుదైన మొక్కను పవన్ కల్యాణ్ తన తల్లి అంజనా దేవికి అంకితం ఇస్తూ నాటడం విశేషం.ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రజలకు ఒక బహిరంగ విజ్ఞప్తి చేశారు. "మనకు జన్మనిచ్చిన తల్లిపై ప్రేమతో, గౌరవంతో ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరిట కనీసం ఒక్క మొక్కనైనా నాటాలి. మనమంతా కలిసికట్టుగా పచ్చదనాన్ని పెంచి, పర్యావరణాన్ని కాపాడుకుందాం" అని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు.రాష్ట్రంలో అడవుల శాతాన్ని, పచ్చదనాన్ని భారీగా పెంచే లక్ష్యంతో పవన్ అత్యంత ప్రతిష్టాత్మకమైన 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రభుత్వం ఒక భారీ టార్గెట్‌ను నిర్దేశించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా 2.5 కోట్ల విత్తన బంతులను సిద్ధం చేసి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈ విత్తన బంతులను అటవీ ప్రాంతాలు, బంజరు భూములు, ప్రభుత్వ ఖాళీ స్థలాలలో చల్లడం ద్వారా సహజసిద్ధంగా అడవుల పునరుత్పత్తి జరిగేలా ప్లాన్ చేశారు.భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని అందించాలన్నా, పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నా ఇలాంటి హరిత కార్యక్రమాలు అత్యంత కీలకమని పవన్ నొక్కి చెప్పారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ పచ్చని ఉద్యమంలో చురుగ్గా పాల్గొనాలని ఆయన కోరారు.

# హైదరాబాద్ జనాభా కోటిన్నర!

**మొదటిపేజీ తరువాయి -** నమోదవుతున్నాయి. 90 శాతం ఇళ్లలోనే 1.3 కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. ఆ లెక్క ఆధారంగా వంద శాతం సర్వే పూర్తయితే జనాభా కోటిన్నర వరకు ఉండే అవకాశం ఉంది. 90 శాతం ఇళ్లలో 5 శాతం వరకు తాళం వేసినవి ఉన్నాయి. జూన్ 9న సర్వే గడువు పూర్తవుతుంది. ఈ సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లను మరోసారి సర్వే చేయాలని ప్రధాన జనగణన అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు.మొదటిదశ జనగణన మే 11న మొదలైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 45 లక్షల ఇళ్ల వరకు జనగణన నమోదు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు ఉన్న 300 డివిజన్లను యూనిట్‌గా తీసుకుని హైదరాబాద్ నగరంలో జనాభాను లెక్కిస్తున్నారు. మొత్తం 20 వేల హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లుగా విభజించి ఇంటింటికి సర్వే చేస్తున్నారు. ఎన్యుమరేటర్స్ ఇప్పటివరకు 41 లక్షల ఇళ్లను సందర్శించారు. అయితే ఆయా హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లో మరో 10 శాతం ఇళ్లను సర్వే చేయాల్సి ఉంది.ఒక అంచనాగా 45 లక్షల ఇళ్లు ఉండవచ్చని, వాటిలో కోటిన్నర జనాభా ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఒక కుటుంబం వివరాలను రెండుసార్లు నమోదు చేయడం, సంబంధించిన విషయాలను తప్పులుగా రాయడం వంటివి సరిచేస్తే జనాభా సంఖ్య మారుతుంది. ఫిబ్రవరి 2027లో జరగబోయే రెండోదశ జనగణనలో పూర్తి జనాభా లెక్క తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు.ఐదు శాతానికి పైగా జనాభా ఉదయాన్నే ఉద్యోగాలకు వెళ్లి, రాత్రికి ఇంటికి చేరుకుంటారు. మూతపడ్డ ఇళ్లు జూన్ 3వ వరకు 5.42 శాతం ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనికోసం బ్లాకుల వారీగా వారి ఇళ్లను ఉదయాన్నే సందర్శించాలి. అవసరమైతే సాయంత్రం వరకు కూడా సర్వే చేయాలి. ప్రతి కుటుంబం వివరాలు నమోదు కావాల్సిందేనని ఉన్నతాధికారులు ఎన్యుమరేటర్స్‌కు చెప్పారు. జనాభాలో గ్రేటర్ నగరంలో 3 కార్పొరేషన్ల జనాభాలో జీహెచ్‌ఎంసీ ముందు వరుసలో ఉంది. ఇప్పటికే ఇక్కడ 55 లక్షల జనాభాని లెక్క తెలిసింది. ఆ తర్వాత స్థానంలో సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లు ఉన్నాయి. కానీ కంటోన్మెంట్‌లో మాత్రం జనగణన నత్తనడకన సాగుతోంది.కొందరు ఇంటి యజమానులు



ఎన్యుమరేటర్స్‌కు సహకరించడం లేదు. వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకపోగా, ఎందుకంటూ వారినే ప్రశ్నిస్తున్నారు. దీంతో వివరాలు నమోదు చేసుకునే క్రమంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. సెల్ఫ్ ఎన్యుమరేట్ చేసుకున్న వారు ఐడీ నంబర్ చెప్పేసరికి నిమిషాల వ్యవధిలోనే ప్రక్రియ పూర్తవుతోంది. ఇంటింటా తిరిగే ఎన్యుమరేషన్ సిబ్బందికి సహకరించాలని సెన్సెస్ ఉన్నతాధికారులు కోరుతున్నారు.రాష్ట్రంలో మిగతా చోట్ల కూడా జనగణన జరుగుతోంది. అయితే పలుచోట్ల సిబ్బందికి విచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. నల్గొండ జిల్లా మేళ్లచెరువు మండలంలోని ఓ గ్రామంలో బైకు, కారు ఇంటి ముందే ఉన్న తమవి కాదని చెప్పారు. ఇంటి గురించి అడగ్గా 8 గదులున్నా మూడో, నాలుగో రాసుకోండని చెప్పారు. మరో ఇంటి వారైతే ల్యాప్‌టాప్ ఉన్న, కంపెనీదని చెప్పారు. టీవీ ఉన్న అది పనిచేయట్లేదన్నారు. గ్యాస్‌పొయ్యి ఉన్నా కట్టెల పొయ్యి అని రాయాలని కోరారు.

## సాయిబాబా పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

- అధిక జేష్ఠ మాసం అత్యంత పవిత్రమైనది




**మంథని, జూన్ 05( వార్త సంధ్య)** : ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన మంథని పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో అధిక జ్యేష్ఠ మాసం పురస్కరించుకొని గురువారం పట్టణ పురవీధుల గుండా పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాబా ఆలయంలో భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రతి శనివారం సాయంత్రం 6 గంటల నుండి 7 గంటల వరకు బాబాకు ఎంతో ప్రీతిపాత్రమైన విష్ణు సహస్రనామ పారాయణం చేయాలనే సంకల్పంతో పట్టణంలోని మహిళా భక్తులు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు ఆలయ అర్చకులు రామడుగు సాయి శ్రీనివాస్ తెలిపారు. ఉదయం కాగడ హారతి, మధ్యాహ్నం హారతి, సాయంకాల హారతి అలాగే రాత్రి నిర్వహించబడే శేజ హారతితో పాటు ప్రతి గురువారం పట్టణ పురవీధుల గుండా బాబా పల్లకి సేవా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కాగలరని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు బాబా సంకీర్తనలు ఆలపిస్తూ పాల్గొన్నారు.

## సమాజ సేవకునికి రాష్ట్రస్థాయి గుర్తింపు

- అఖిలభారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా జంబోజు సమ్మయ్య నియామకం



**మంథని:జూన్ 05( వార్త:సంధ్య)** : మంథని పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ వేదిక నాయకుడు జంబోజు సమ్మయ్య చారి అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంథని ప్రాంత విశ్వకర్మ సంఘం నాయకులు శుక్రవారం హర్ష వ్యక్తం చేశారు. గత 20 సంవత్సరాలుగా సమాజానికి విశిష్ట సేవలందిస్తున్న బ్రహ్మశ్రీ జంబోజు సమ్మయ్య చారి అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులు కావడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణం అన్నారు. ఈ మేరకు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారి నియామక ఉత్తర్వులు శుక్రవారం జారీ చేశారు. ఈ సందర్భంగా జంబోజు సమ్మయ్య చారి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర ఉపాధ్యక్ష పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు నౌండ్ల సంతోష్ చారికి కృతజ్ఞతలు తెలిపారు. విశ్వకర్మ బంధువుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం మరింత చిత్తశుద్ధితో కృషి చేస్తానని సమ్మయ్య హామీ ఇచ్చారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా విశ్వకర్మ సమాజ ఐక్యతకు, అభివృద్ధికి సామాజిక పురోగతికి తన వంతు సేవలను అందిస్తానని ఆయన తెలిపారు. సంభయ్య చారి అందరితో కలుపుగోలుగా ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే కష్టజీవి అని సంఘం సభ్యులు కొనియాడారు. సమ్మయ్య చారి నియామకం పట్ల విశ్వకర్మ సంఘాల నాయకులు, సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## లక్ష్మీపురం ప్లాట్ యజమానుల సంక్షేమ సంఘం కు న్యాయం చేయాలని ఆ సంఘం ఉపాధ్యక్షులు కే ఎన్ మూర్తి కోరారు






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య)జూన్ 5** : శుక్రవారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 87 ,35 ఎకరాలలో విస్తరించి 700 ప్లాట్లు ఉన్నాయని చెప్పారు నాదెళ్ల విజయభాస్కర చౌదరి నాదెళ్ల ఎస్టేట్ అనే పేరుతో చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడని ప్లాట్ల యజమానులకు వ్యతిరేక భూములు కబ్జా చేస్తున్నాడని ఆయన ఆరోపించారు ఎమ్మార్వో ,హెచ్ఎండిఏ ఫ్లాట్ చేసి తమకు తెలియకుండా విక్రయిస్తున్నారని ఆయన ఆరోపించారు ప్లాటు యజమానులను బెదిరిస్తున్నాడని భూ మాఫియాతో ఆగడాలు ఎక్కువయ్యాయని ఆయన ఆరోపించారు కొల్లాపూర్ సర్వేనెంబర్ 188 సంబంధించి ఏడు ఎక్కడ భూమిని కలిగి ఉన్నారని ప్రసాద్ అనే వ్యక్తి ఆ భూమిని మాఫీతో నడిపిస్తున్నాడని ఆరోపించారు లక్ష్యం పురం ప్లాట్ యజమానులతో సంక్షేమ సంఘంతో గతంలో కలిసి ఉండి భూకబ్జిదారులతో చేతులు కలిపి ప్లాట్ ఓనర్లను మోసం చేస్తున్నాడని రాజేష్ ఆరోపించారు కొల్లూరు గ్రామం సర్వేనెంబర్ 188 యాజమాన్య హక్కులు ఉన్నాయని కోర్టులో కేసులు కూడా వేయడం జరిగిందని ఆయన తమకు న్యాయం జరగడం లేదని ఆయన ఆరోపించారు లక్ష్యం పురం ప్లాట్ల యజమానుల సంక్షేమ సంఘం న్యాయం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన కోరారు జాయింట్ సెక్రెటరీ గిరి రాణి మాట్లాడుతూ ప్లాటు దారులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రిని కోరారు లక్ష్మి మాట్లాడుతూ లక్ష్మీపురం ప్లాట్ యజమానులకు సంక్షేమ సంఘం అండగా ఉంటుందని తమ న్యాయమైన డిమాండ్ పరిష్కరించాలని ఆమె ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో శ్రీకాంత్ తోపాటు పలువురు ప్లాట్ ఓనర్లు తదితరులు పాల్గొన్నారు


## రవీంద్రభారతిలో ఆకట్టుకున్న జానపద ఆటా-పాట





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) జూన్ 5** : రవీంద్రభారతిలో కొనసాగుతున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక మహోత్సవంలో భాగంగా 65 వ రోజు "పాల్కురికి సోమన్న మూల" వేదికపై జానపద గాయకులు కోండ్ర కుమార్ బృందం - భూపాలపల్లి జిల్లా వారు.. ఏట రవి - పెద్దపల్లి జిల్లా వారు జానపద గేయాలతో ఉర్రూతలూగించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నర్సింహ్మారెడ్డి గారు జనపద కళాకారులను ఘణంగా సత్కరించినారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా.విజయ్ కుమార్ గారు సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు నర్సింలు సాంస్కృతిక శాఖ సలహాదారులు ముచ్చర్ల దినకర్ పాల్గొన్నారు. ప్రధాన కార్యక్రమానికి కంటే ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బాలుప్రసాద్, విద్యానందాచారి, మాపల్లె శంకర్, రేలారే ప్రసాద్, ఏర్పుల క్రాంతి, జ్యోత్స్న సామాజిక చైతన్య గీతాలు, జానపద గేయాలతో అలరించారు. కార్యక్రమానికి శ్రీనివాస్ రాజు వ్యాఖ్యాతగా వ్యవహరించారు..

## ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ మెట్రోలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి మరియు అంబర్‌పేట్ ఎమ్మెల్యే. కాలేరు వెంకటేష్



**ఎల్బీనగర్ ప్రతినిధి, జూన్ 5 (వార్త సంధ్య):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా "వాహన కాలుష్యాన్ని తగ్గిద్దాం -- పర్యా వరణాన్ని కాపాడుదాం" అనే సందేశంతో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అంబర్ పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తో కలిసి మెట్రో రైల్లో ప్రయాణించారు. ప్రజా రవాణా వినియోగాన్ని ప్రోత్సహిస్తూ పర్యా వరణ పరిరక్షణకు తమ మద్దతును తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి,కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ధర్మకర్త మధు సాగర్,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ అవగాహన ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి





**ఎల్బీనగర్ ప్రతినిధి, జూన్ 5 (వార్త సంధ్య):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈరోజు ఎల్‌బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి , బీఆర్ఎస్ నాయకులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్ నుంచి కొత్తపేట వరకు సైకిల్‌పై ప్రయాణిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షిం చాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ప్రకృతి వనరుల క్షీణత మానవ జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యం లో పర్యావరణ పరిరక్షణ అత్యవసరమని పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలు, కాలనీలు, విద్యాసంస్థలు, కార్యాలయాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, వాతావరణ మార్పులపై చైతన్యం కల్పించడం, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించడం, ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడం, జీవ వైవిధ్యాన్ని సంరక్షించడం, అలాగే నీరు, గాలి, నేల కాలుష్యాన్ని నివారించడం అని తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణ కోసం: మొక్కలు నాటి సంరక్షించాలి

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలి నీటిని వృథా చేయకుండా ఆదా చేయాలి సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా లేదా సైకిళ్లను వినియోగించాలి చెత్తను వేర్వేరుగా సేకరించి రీసైక్లింగ్ చేయాలి పర్యావరణాన్ని కాపాడుదాం... భవిష్యత్తును రక్షిద్దాం", "ఒక్క మొక్క ఎన్నో ప్రాణాలకు ఆధారం ప్రకృతి మన సంపద -- పరిరక్షణ మన బాధ్యత అని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్, చైతన్యపురి మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి, సత్యం చారి, గండి సన్నీ యాదవ్, రవి ముదిరాజ్,, ముద్ద కళ్యాణ్, గండికోట శ్రీనాథ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల ఆశయ సాధనకు ప్రతీకగా విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



**జూన్ 05( వార్త:సంధ్య)** : తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు మేరకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు శుక్రవారం వెంకటాపూర్ క్రాసింగ్ వద్ద మహనీయులు నిపుణుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, భారతీయ గొప్ప సంఘ సంస్కర్త, బహుజన ఉద్యమ పితామహుడు మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాల స్థలానికి ఈరోజు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, ఎస్సి సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథెన సత్యం, వ్యవసాయ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవికంటి సతీష్,నూకల బానయ్య ,సర్పంచులు జాడి రాజబాబు, భూకొండ రవి,గుమ్మడి సమ్మయ్య , మాట్లాడుతూ ఈరోజు వెంకటాపూర్ క్రాసింగ్ వద్ద మహనీయుల విగ్రహాల కోసం భూమి పూజ చేయడం చాలా హర్షనీయమని ఆ మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు పూర్తిగా సహకరించిన మంత్రి కి ధన్యవాదాలు తెలుపుకుంటూ శ్రీపాద రావు విగ్రహాలే కాకుండా మహనీయుల విగ్రహాలు పెట్టడంలో మా కాంగ్రెస్ పార్టీ మరియు మంథని నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముందు ఉంటరాని అలాగే మహనీయుల విగ్రహాలు ప్రతి మండలంలో నిర్వహిస్తామని, తెలియజేస్తారు.అలాగే 40, 50 సంవత్సరాలు నుంచి అట్టడుగు వర్గాలు బీసీలు ఎస్సీలు ఎస్టీలు మైనార్టీలు ఈరోజు దుదిల్ల కుటుంబంతోనే ఉన్నారు.కనుక ఆ కుటుంబం వెంట ఉన్నందుకు ఆ మహనీయుల ఆశయాలను ఈరోజు వారే కొనసాగిస్తున్నారని ఆ మహనీయుల వారసులు నిజంగా ఎవరంటే దుద్దుల్ల కుటుంబం మాత్రమేమని ఈ ప్రాంతంలో అట్టడుగు ప్రజలు రాజకీయంగా ఎన్నో పదవులు అనుభవిస్తున్నారంటే మంత్రి శ్రీధర్ బాబు కృషి వలన అని తెలియజేస్తూ ఈరోజు కొంతమంది తెలివి లేక మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మాటల్లో కాదు చేతల్లో చూపించే వ్యక్తి ఎవరంటే దుదిల్ల శ్రీధర్ బాబు గారు మరియు వారి కుటుంబం మాత్రమే అని కొనియాడారు మంత్రి చొరవతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని అలాగే మహనీయులు విగ్రహాలు ప్రతి మండలంలో పెడతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఉపసర్పంచ్లు, మాజీ సర్పంచులు, గ్రామశాఖ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, అన్ని విభాగాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఎస్‌యూవీ ప్రియుల కోసం పీపీఎస్-ఎంజీలో ఎంజీ మేజెస్టర్ 42 ఆటోమేటిక్ టాప్ ట్రిమ్ ఆవిష్కరణ ధర రూ.40.99 లక్షలు (ఎక్స్-షోరూమ్)





**ఎల్బీనగర్, జూన్ 5 (వార్త సంధ్య):** జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతదేశపు తొలి డి ప్లస్ ఎస్ యు వి ఎంజీ మేజెస్టర్‌ను హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ పీపీఎస్-ఎంజీ షోరూమ్‌లో ఎల్బీనగర్ ఏసీపీ ఏ.కృష్ణయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీపీఎస్-ఎంజీ సీఈవో జి.నీరజ్, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా రీజినల్ సేల్స్ మేనేజర్ అభినయ్ ఆకుల, పీపీఎస్-ఎంజీ జీఎం (సేల్స్)సందీప్ రావు తదితరులు పాల్గొన్నారు.తదుపరి ఎస్ యు వి నుంచి మరింత మెరుగైన అనుభవాన్ని కోరుకునే వినియోగదారుల కోసం రూపొందించిన మేజెస్టర్, ఆకర్షణీయమైన డిజైన్, ఆధునిక ఇంజినీరింగ్ మరియు అత్యుత్తమ ఆఫ్-రోడ్ సామర్థ్యాలను కలగలిపింది. ఎంజీ మేజెస్టర్ 4ఇ2 ఆటోమేటిక్ టాప్ ట్రిమ్ (6 మరియు 7 సీటర్) ధరను రూ.40.99 లక్షలు (ఎక్స్-షోరూమ్), ఎంజీ మేజెస్టర్ 4ఇ4 ఆటోమేటిక్ టాప్ ట్రిమ్ (7 సీటర్ మాత్రమే) ధరను రూ.44.99 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా ప్రకటించారు.ఈ సందర్భంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ అనురాగ్ మెహ్రోత్రా మాట్లాడుతూ, "భారతదేశపు తొలి డి ప్లస్ ఎస్ యు వి గా ఎంజీ మేజెస్టర్ మా పోర్ట్‌ఫోలియోలో ఒక కీలక చేరిక. అత్యుత్తమ పనితీరు, ప్రీమియం సౌకర్యాలు, ఆధునిక సాంకేతికత, విశ్వసనీయతను సమన్వయం చేస్తూ ఇది వినియోగదారులకు ప్రత్యేక అనుభూతిని అందిస్తుంది. అసమాన పరిమాణం, ఆఫ్-రోడ్ సామర్థ్యాలు, సెగ్మెంట్‌లో తొలిసారిగా అందిస్తున్న అనేక ఫీచర్లతో మేజెస్టర్ భారత ఎస్ యు వి మార్కెట్లో కొత్త ప్రమాణాలను నెలకొల్పుతుంది" అని తెలిపారు. పి పి ఎస్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ రాజీవ్ సంఘ్వీ మాట్లాడుతూ, "భారతదేశపు తొలి డి ప్లస్ ఎస్ యు వి అయిన ఎంజీ మేజెస్టర్ దేశంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూసిన లాంచ్‌లలో ఒకటి. వినియోగదారుల అవసరాలపై మా అవగాహన, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ యొక్క భవిష్యత్ సాంకేతిక వాహనాల బలంతో అత్యుత్తమ యాజమాన్య అనుభవాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నాం. ఎంజి నెట్‌వర్క్‌లో అత్యధిక కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ స్కోర్‌తో పాటు హైదరాబాద్‌లో ప్రతి అవుట్‌లెట్‌కు అత్యధిక సగటు అమ్మకాల రికార్డును పి పి ఎస్ మోటార్స్ సాధించింది" అని పేర్కొన్నారు.'ఎంజి షీల్డ్ ' యాజమాన్య కార్యక్రమం కింద మూడు సంవత్సరాల అపరిమిత కిలోమీటర్ల వారంటీ, మూడు సంవత్సరాల రోడ్‌సైడ్ అసిస్టెన్స్, మూడు ఉచిత లేబర్ సర్వీసులు లభిస్తాయి. అదనంగా వారంటీ, రోడ్‌సైడ్ అసిస్టెన్స్‌ను పొడిగించుకునే అవకాశం కూడా ఉంది. అలాగే 70% వరకు హామీతో కూడిన బైబ్యాక్ ప్రోగ్రామ్‌ను ఎంజి అందిస్తోంది.



## మట్టికి ముసుగు.. దందాకు దారి!

రైతు పేరుతో రాత్రింబవళ్లు మట్టి దోపిడి
చెరువులు, కాలువలే లక్ష్యంగా అక్రమ తవ్వకాలు
చూసీ చూడనట్టు అధికారుల తీరు పై ప్రజల ఆగ్రహం

**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 05 (వార్త సంధ్య) :** మట్టి పేరుతో అశ్వారావుపేట మండలంలో సాగుతున్న అక్రమ దందా రోజురోజుకూ విస్తరిస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రైతుల అవసరాల పేరుతో అనుమతులు తీసుకుని, వాటిని అడ్డంగా పెట్టుకొని భారీ ఎత్తున మట్టి వ్యాపారం జరుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం నుంచి పల్లెల వరకు ఎక్కడ చూసినా మట్టితో నిండిన ట్రాక్టర్లు పరుగులు పెడుతుండగా, సంబంధిత శాఖల అధికారులు మాత్రం మౌనంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది.



### చెరువులు, కాలువలపై కన్ను

ముఖ్యంగా చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములు లక్ష్యంగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతుల పేర్లను అడ్డంగా పెట్టుకుని అవసరానికి మించిన మట్టిని తరలిస్తూ వేలాది రూపాయలు సంపాదిస్తున్నారనే చర్చ మండలవ్యాప్తంగా సాగుతోంది. ఎక్కడ మట్టి కనిపించినా అక్కడికి యంత్రాలు చేరడం, రాత్రింబవళ్లు ట్రాక్టర్లు తిరగడం సాధారణంగా మారిపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు.

### పర్మిషన్ల ముసుగులో వ్యాపారం

రైతు అవసరాల కోసం మాత్రమే మట్టి వినియోగించాల్సి ఉండగా, అదే అనుమతులను వ్యాపార ప్రయోజనాలకు వినియోగిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అసలు ఎవరికి అనుమతులు జారీ అయ్యాయి? ఎంత మేర మట్టి తరలిస్తున్నారు? ఎక్కడ వినియోగిస్తున్నారు? అనే అంశాలపై సరైన పర్యవేక్షణ లేకపోవడంపై ప్రజలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

### అధికారుల నిర్లక్ష్యమే బలం?

ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారుల నిర్లక్ష్యమే ఈ అక్రమ దందాకు ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామాల మధ్య పట్టపగలు మట్టి రవాణా జరుగుతున్నా తనిఖీలు లేకపోవడం, వాహనాలను ఆపి పత్రాలు పరిశీలించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కొందరు అధికారుల మౌనం వెనుక మట్టి పైసల మాయ ఉందా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### ప్రజల ప్రాణాలకు ముప్పు

అధిక వేగంతో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు గ్రామీణ రహదారులను దెబ్బతీయడమే కాకుండా ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, రైతులు, వృద్ధులు ఈ వాహనాల కారణంగా తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు.

### జిల్లా అధికారులు స్పందించాలి

రోజూ అక్రమ మట్టి రవాణా జరుగుతున్నప్పటికీ "మాకు సమాచారం లేదు", "అక్రమాలు కనిపించడం లేదు" అన్నట్టుగా వ్యవహరించడం సరికాదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మట్టి దందాపై ఉక్కుపాదం మోపాలని, చెరువులు, కాలువలు, ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## కోహెడలో "సాధ్యం లా ప్రొఫెషనల్ అకాడమీ" ప్రారంభించిన ఎమ్మెల్యే

**నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో యువ న్యాయ వాదులు పాత్ర కీలకం**

**న్యాయవృత్తిలో మార్పులను అందిపుచ్చుకోవాలి**

**చదువే వ్యాపారంగా కాకుండా సేవగా ఉండాలి**

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి**





**ఎల్బీనగర్, జూన్ 5(వార్త సంధ్య) :** ఆధునిక డిజిటల్ యుగంలో న్యాయ వ్యవస్థలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూనే, నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో యువ న్యాయవాదులు కీలకపాత్ర పోషించాలని ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. అదేవిధంగా "లా అకాడమీ" నిర్వహణకు కృషి చేయాలని ఆయన అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడ సమీపంలోని నూతనంగా ఏర్పాటు చేసిన "సాధ్యం లా ప్రొఫెషనల్ అకాడమీ" ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. న్యాయ విద్యలో నాణ్యతను పెంచాలనే నిర్వాహకుల దూరదృష్టికి అభినందనలు తెలిపారు. న్యాయవృత్తుల పట్ల, విద్యపై ఉన్న మక్కువతో అకాడమీలో కల్పించిన వసతులను ప్రత్యేకంగా ప్రశంసించారు. చదువును కేవలం వ్యాపారంగా కాకుండా సేవగా భావించాలని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. అనంతరం సాధ్యం లా ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపకుడు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది మునగ సతీష్ మాట్లాడుతూ.. గ్రామీణ పట్టణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన న్యాయ విద్యను ముఖ్యంగా పేద ప్రజలకు న్యాయ విద్యను అతి తక్కువ ఖర్చుతో అందించడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో న్యాయ రంగానికి ఉత్తమ ప్రతిభవంతులను అందిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. న్యాయ విద్యను మరింత ప్రోత్సహిస్తూ, భావి న్యాయవాదులకు నాణ్యమైన విద్య ను అందించాలనే లక్ష్యంతో సాధ్యం లా ప్రొఫెషనల్ అకాడమీ పనిచేస్తుందని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు, విద్యార్థులు సామాజిక కార్యకర్తలు ప్రజాప్రతినిధులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఐ ప్రజాపోరాటాలు, కూనంనేని ప్రగతికి ఆకర్షితులై భారీగా చేరికలు

**పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలిచే ఏకైక పార్టీ సిపిఐ**

**ప్రజలకు సేవలు అందిస్తూ గ్రామాల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలి**

**అంబేద్కర్ నగర్ సమగ్ర అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం**

**రాబోయే రోజుల్లో ఎర్రజెండా నీడన మరింత ఉధృతంగా ప్రజా ఉద్యమాలు**

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 05 (వార్త సంధ్య) :** ఎమ్మెల్యే కూనంనేని ప్రగతి, సిపిఐ ప్రజాపోరాటాలకు ఆకర్షితులై పేద, బడుగు, బలహీన వర్గాలు భారీగా పార్టీలో చేరుతున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండలం అంబేద్కర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ గ్రామానికి చెందిన 15 కుటుంబాల వారు శుక్రవారం కొత్తగూడెంలోని సిపిఐ జిల్లా కార్యాలయం శేషగిరిభవన్ జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చేరిన వారికి ఆయన ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పేద ప్రజల ఆశాజ్యోతిగా సిపిఐ నిలిచిందని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక పార్టీ ఎర్రజెండానే అని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన కొత్త సభ్యులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి సేవలందిస్తూ పార్టీని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ నగర్ గ్రామాభివృద్ధికి, అక్కడ దశాబ్దాలుగా వేధిస్తున్న సమస్యల శాశ్వత పరిష్కారానికి తాము పూర్తిగా కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే కూనంనేని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నారని, ప్రజల పక్షాన నిలబడి పోరాడే కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని వివరించారు. పార్టీలో చేరిన వారిలో పోతురాజు శ్రీను, మధు, ఎం. పుల్లయ్య, ఇనుగంటి రాజు, మహేష్, సారయ్య, భాస్కర్, పరిశుద్ధ ఉన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, నాయకులు నీడలా సుధాకర్, మన్నెం వెంకన్న, జగదంబ, మేఘనాథ్, శంకర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, జూన్ 05 (వార్త సంధ్య) :** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింగరేణి ప్రధాన కార్యాలయంలో కార్పొరేట్ పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్ పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు పర్యావరణ హిత సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో రూపొందించిన ప్రత్యేక జూట్ బ్యాగులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వంగ వెంకట్ మాట్లాడుతూ, ప్రకృతి మరియు పర్యావరణ పరిరక్షణ నేటి సమాజం ఎదుర్కొంటున్న అత్యంత కీలకమైన బాధ్యతలలో ఒకటని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అడవుల నరికివేత, నీటి వనరుల క్షీణత వంటి సమస్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి నీటి వనరులను పరిరక్షించాలని పిలుపునిచ్చారు. భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన మరియు సురక్షితమైన వాతావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి సంస్థ చేపడుతున్న హరిత కార్యక్రమాలు, విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం, కాలుష్య నియంత్రణ చర్యలు మరియు పర్యావరణహిత కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉన్నతాధికారులు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల పురోగతిపై ముగిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 5 :** ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించిన సీఎం. అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూసేకరణ పూర్తి చేయకుండా ప్రాజెక్టుల పనులు ముందుకు సాగవు భూసేకరణకు మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేయాలి స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమన్వయం చేసుకుని భూసేకరణ పూర్తి చేయాల్సిన బాధ్యత సంబంధిత జిల్లాల కలెక్టర్లదే కలెక్టర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి భూసేకరణకు సంబంధించి అవసరమైన నిధులు ఎప్పటికప్పుడు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

## మానవత్వం చాటుకున్న చీకటిమామిడి బీఆర్ఎస్ కార్యకర్తలు

## మృతుడి కుటుంబానికి రూ.15,000 ఆర్థిక సహాయం




**మునుగోడు:,జూన్- 5 (వార్త సంధ్య ) :** మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన జీడిమడ్ల రవి మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామ బీఆర్ఎస్ కార్యకర్తలు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా రవి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో కార్యకర్తలు కలిసి రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయిన ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని,పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.గ్రామంలో ఎవరికైనా ఆపద వచ్చినప్పుడు ముందుండి సహాయం చేయడం బీఆర్ఎస్ కార్యకర్తల ప్రత్యేకత అని, మానవత్వం మరియు సామాజిక బాధ్యతతో ఈ సహాయాన్ని అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు కార్యకర్తల సేవా భావాన్ని అభినందించారు.మృతుడు జీడిమడ్ల రవి ఆత్మకు శాంతి చేకూరాలని,ఆయన కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని కార్యకర్తలు ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ మారగోని యాదమ్మ అంజయ్య, కంటెస్టెడ్ సర్పంచ్ జీడిమడ్ల జలంధర్, వార్డు నెంబర్ చింతల లోకేష్, గ్రామ శాఖ అధ్యక్షులు సింగం సైదులు, మాజీ వార్డు నెంబర్ కొమ్మినేని పద్మారావు, మండల నాయకులు జీడిమడ్ల కృష్ణయ్య, రాములు,శివరాజ్, జగన్ చింతల అంజయ్య,నరేష్ కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సోమశిలలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) జూన్ 5 :** హాజరైన మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహా, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు.

## అంగన్వాడి కేంద్రంలో యూనిఫాం పంపిణీ చేసిన సర్పంచ్




**మంథని జూన్ 05 (వార్త సంధ్య) :** మంథని మండలం ఏక్లాస్ పుర్ గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం పిల్లలకు యూనిఫామ్ బొడ్డు రజిత శ్రీనివాస్ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## వనస్థలిపురం లో హన్స్ షాపింగ్ మాల్ ఘనంగా ప్రారంభోత్సవం



**ఎల్బీనగర్, జూన్ 5(వార్త సంధ్య) :** వనస్థలిపురంలోని సుష్మా థియేటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హన్స్ షాపింగ్ మాల్‌ను శ్రీ బాలాజీ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వాహకులు పన్నాలాల్ చౌదరి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు, ఫ్యాషన్ ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకువస్తూ 35 సంవత్సరాల అనుభవంతో హన్స్ షాపింగ్ మాల్ నూతన శాఖ ను ఘనంగా ప్రారంభించడం చేయడం సంతోషంగా ఉందన్నారు. మహిళలు, పురుషులు, పిల్లల కోసం అన్ని రకాల వస్త్రాలు, ట్రెండీ ఫ్యాషన్ కలెక్షన్లు ఒకే చోట అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆఫర్లు, ఆకర్షణీయమైన డిస్కౌంట్లు వినియోగదారులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్ గా టీ షర్ట్ ని 149-కే అందిస్తున్నామని, సారీస్, షర్ట్స్, పాంట్స్ పై 1o1 ఆఫర్ ను కూడా అందిస్తున్నామని స్థానిక ప్రజలు షాపింగ్ మాల్ కి విచ్చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. నాణ్యత, సరసమైన ధరలు, విస్తృత కలెక్షన్లతో హన్స్ షాపింగ్ మాల్ వినియోగదారుల ఆదరణ పొందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం



**జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద**

**పెద్దపల్లి, జూన్-05( వార్త సంధ్య) :** జిల్లాలో పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ తెలుగు పరీక్షలు నిర్వహించామని, ఈ పరీక్షకు (43) మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, (33) మంది విద్యార్థులు హాజరయ్యారని, 76.74 శాతం హాజరు నమోదు అయ్యిందని తెలిపారు. ఇట్టి పరీక్షకు సంబంధించి ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని, పరీక్ష కేంద్రంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థుల పరీక్ష ఫీజు భరించనున్న ఎస్పీఎఫ్!



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** విద్యార్థుల్లో విద్యా ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించే లక్ష్యంతో స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర వ్యాప్తంగా "మెరిట్ ఆధారిత రివార్డ్ ప్రోగ్రామ్"ను ప్రారంభించింది. జేఎన్‌టీయూ హైదరాబాద్ క్యాంపస్‌లో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. సెమిస్టర్ పరీక్షల్లో 9.0 లేదా అంతకంటే ఎక్కువ సిజిపిఎ సాధించిన విద్యార్థులు, లేదా 95 శాతం కంటే ఎక్కువ హాజరు కలిగిన వారు ఈ రివార్డుకు అర్హులని ప్రకటించారు. అర్హత సాధించిన విద్యార్థుల తదుపరి సెమిస్టర్ పరీక్ష ఫీజును ఎస్పీఎఫ్ పూర్తిగా భరిస్తుందని ఆయన వెల్లడించారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణతో పాటు, వారి వ్యక్తిత్వ వికాసానికి ఎస్పీఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దుర్గాప్రసాద్, శ్రీను, సాగర్, రాజు, చైతన్య, హేమంత్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు. చదువులో ప్రతిభ చూపండి క్రమశిక్షణ పాటించండి సమాజానికి సేవ చేయండి మీ కృషికి ఎస్పీఎఫ్ గుర్తింపు ఇస్తుంది ఎస్పీఎఫ్ రాష్ట్ర కమిటీ

## సీఎం రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5:00 గంటలకు మియాపూర్‌లో రూ. 161 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణ భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో శుక్రవారం మియాపూర్‌లోని శంకుస్థాపన స్థలాన్ని కాంగ్రెస్ నాయకులు బండి రమేష్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను, వేదిక నిర్మాణ పనులను వారు నిశితంగా పరిశీలించి అధికారులకు, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపుడి గాంధీ, రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్ చల్ల నర్సింహా రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమంతో పాటు నగరాల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. అందులో భాగంగానే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమానికి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కార్తకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి పర్యటనను ఘనంగా విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఆస్పత్రిలో కాంపౌండర్ ఆత్మహత్య

**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్ 1లోని ప్రీతి హాస్పిటల్‌లో విషాదం చోటుచేసుకుంది. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న జువ్వి భీమసేన (35) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... సంగారెడ్డి జిల్లా సిర్గపూర్ మండలం కద్పాల్ గ్రామానికి చెందిన జువ్వి భీమసేన గత కొన్నేళ్లుగా కేపీహెచ్‌బీలోని ప్రీతి హాస్పిటల్‌లో పని చేస్తున్నాడు. అతను తన కుటుంబంతో కలిసి మదీనగూడలోని కృష్ణానగర్‌లో నివసిస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రాత్రి విధులకు వచ్చిన భీమసేన, తెల్లవారుజామున ఆస్పత్రిలోని ఓ కుర్చీలో స్పృహ తప్పి పడిపోయి ఉన్నాడు. మొదట అతను నిద్రపోతున్నాడని భావించిన తోటి సిబ్బంది, ఉదయం 6 గంటల ప్రాంతంలో ఎంత లేపినా లేవకపోవడంతో వెంటనే రెమిడీ ఆస్పత్రికి తరలించారు. అయితే, భీమసేన అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఘటనపై ఆస్పత్రి సిబ్బంది సమాచారం ఇవ్వడంతో మృతుడి తండ్రి జువ్వి అంజయ్య కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హాస్పిటల్‌లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా, రాత్రి డ్యూటీలో ఉన్న భీమసేన స్వయంగా ఒక ఇంజెక్షన్‌ను శరీరంలోకి ఇంజెక్ట్ చేసుకున్నట్లు తేలింది. ఆర్థిక ఇబ్బందుల వల్లే తన కొడుకు ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## దళిత కుటుంబంపై దుష్ప్రచారం ఖండనీయం



**- ఎమ్మార్వో, ఎంపీడీవోలకు వినతిపత్రం**

**మునుగోడు, :జూన్ -05 (వార్త సంధ్య):** ప్రజల తీర్పుతో ఎన్నుకోబడిన నాయకత్వాన్ని ఓర్వలేకనే కొందరు రాజకీయ నాయకులు తమ కుటుంబంపై దుష్ప్రచారం చేస్తున్నారని మునుగోడు మండలం గుండ్లోరిగూడెం సర్పంచ్ జంగిలి సునీత సాంబయ్య ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి సంబంధించి ఇటీవల కొన్ని పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆమె స్పష్టం చేశారు.తన భర్త జంగిలి సాంబయ్యపై కొందరు రాజకీయ నాయకులు, అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావాలనే నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ జెండా దేశ గౌరవానికి ప్రతీక అని, తమ కుటుంబం ఎల్లప్పుడూ జాతీయ పతాకానికి అత్యున్నత గౌరవం ఇస్తూ వచ్చిందన్నారు.జెండాకు అడ్డుగా ఉన్న గన్నేరు చెట్టు కొమ్మను తొలగించే క్రమంలో జరిగిన చిన్న సంఘటనను కొందరు వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి రాజకీయ రంగు పులిమి ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా సాగుతుండటంతో పాటు ప్రజల్లో తమకు పెరుగుతున్న ఆదరణను ఓర్వలేక కొందరు నాయకులు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.గత ఐదేళ్ల పాటు జంగిలి సాంబయ్య ఉపసర్పంచ్‌గా గ్రామ ప్రజలకు అంకితభావంతో సేవలందించారని, ఆయన సేవలను గుర్తించిన ప్రజలు జనరల్ మహిళా కోటాలో తనను సర్పంచ్‌గా ఎన్నుకుని బాధ్యతలు అప్పగించారని తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగాగ్రామాభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.వ్యక్తిగత ద్వేషం, రాజకీయ కక్షతో దళిత కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని అసత్య ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు ఫలించవని, గ్రామ ప్రజలు నిజానిజాలను గుర్తించేంత చైతన్యం కలిగి ఉన్నారని అన్నారు.ఈ సందర్భంగా దళిత కుటుంబంపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని అరికట్టాలని కోరుతూ ఎమ్మార్వో నేలపట్ల నరేష్, ఎంపీడీవో విజయభాస్కర్‌లకు, వినతిపత్రం అందజేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. అలాగే పత్రికా విలేకరులు, ప్రజలు వాస్తవాలను పరిశీలించిన తర్వాతే వార్తలను ప్రచారం చేయాలని, అసత్య ప్రచారాలకు ప్రాధాన్యం ఇవ్వవద్దని సర్పంచ్ జంగిలి సునీత సాంబయ్య విజ్ఞప్తి చేశారు.

## మొక్కలు నాటిన ఎంపీడీవో శ్రీజ రెడ్డి

**- ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసిన గట్టు కృష్ణమూర్తి**



**మంథని జూన్ 05(వార్త సంధ్య) :** జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మంథని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు మండల అభివృద్ధి అధికారిణి కె శ్రీజా రెడ్డి మొక్కలు నాటారు. మంథని ప్రాంతంలో పర్యావరణ ప్రియుడిగా పేరుగాంచిన గట్టు కృష్ణమూర్తి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీజా రెడ్డి మాట్లాడుతూ మంథని పరిసర ప్రాంతాల్లో గత ఐదు సంవత్సరాలుగా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి కృష్ణమూర్తి వేయికి పైగా మొక్కలు నాటారని కొని ఆడారు. మొక్కలను నాటడమే కాకుండా వాటి పర్యవేక్షణ బాధ్యతలు కూడా చూసుకుంటున్న కృష్ణమూర్తిని మండల వ్యవసాయ అధికారిణి డాక్టర్ నవ్య ఈ సందర్భంగా అభినందించారు. కృష్ణమూర్తి జిల్లాస్థాయిలో రాష్ట్రస్థాయిలో అనేక అవార్డులు పొందడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణమని శ్రీజా రెడ్డి, నవ్యలు గుర్తు చేశారు. అనంతరం కృష్ణమూర్తిని సన్మానించారు.

## ఆధారాలు లేని ఆరోపణలను కామారెడ్డి ప్రజలు నమ్మరు - ఇప్ప శ్రీనివాస్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి జూన్ 5 ( వార్తా సంధ్య ) :** కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం దశాబ్దాలుగా కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షబ్బీర్ అలీ గారిపై గడ్డం చంద్రశేఖర్ రెడ్డి చేసిన రూ.4 కోట్ల లంచం ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇప్ప శ్రీనివాస్ పేర్కొన్నారు. చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవాలు, నిరాధారమైనవి మరియు రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు చేసిన చౌకబారు ప్రయత్నమని ఆయన విమర్శించారు. రూ.4 కోట్లు తీసుకున్నారని ఆరోపిస్తున్నట్లయితే, దానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచాలని సవాల్ విసిరారు. మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని ఓర్వలేకపోయిన చంద్రశేఖర్ రెడ్డి, తన అనుచరుల ద్వారా పలు కేసులు వేయించిన విషయాన్ని ప్రజలు మరచిపోలేదన్నారు. కామారెడ్డి అభివృద్ధిని చూసి తట్టుకోలేకనే ఈ విధమైన బురదజల్లే రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. గత 40 సంవత్సరాలుగా కామారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో షబ్బీర్ అలీ పాత్ర ఎంతో గొప్పదని, అత్యధిక సంఖ్యలో సర్పంచ్‌లను గెలిపించిన నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. అలాంటి నాయకుడి నైతికతపై ప్రశ్నించే అర్హత చంద్రశేఖర్ రెడ్డికి లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ, అవి వ్యక్తిత్వ హననానికి దారి తీసే విధంగా నిరాధార ఆరోపణలుగా మారితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నోరుంది కదా అని ఇష్టానుసారంగా మాట్లాడితే కామారెడ్డి ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. చంద్రశేఖర్ రెడ్డి తన అవాస్తవ ఆరోపణలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకపోతే ప్రజల ముందు ఆయన వైఖరిని ఎండగడతామని హెచ్చరించారు. అదేవిధంగా పార్టీ క్రమశిక్షణా సంఘం వెంటనే స్పందించి, చంద్రశేఖర్ రెడ్డిపై తగిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే పార్టీ నుండి శాశ్వతంగా తొలగించాలని డిమాండ్ చేశారు. "సత్యాన్ని అబద్ధాలతో కప్పిపుచ్చలేరు. కామారెడ్డి ప్రజలు నిజానిజాలను బాగా గుర్తిస్తారు. నిరాధార ఆరోపణలకు ఇక్కడ స్థానం లేదు."

**- ఇప్ప శ్రీనివాస్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కామారెడ్డి**

# వంజరి కులస్తులకు ఎస్టీ హోదా పునరుద్ధరించాలి

**ఉప్పల్ ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్లు మంజూరు చేయాలన్న సంఘం**

**వంజరి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరింపు**

**ట్రస్టు ఎన్నికలు వెంటనే నిర్వహించాలని విజ్ఞప్తి**

**ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత వంజరి సేవా సంఘం డిమాండ్**




**హైదరాబాద్, వార్తసంధ్య, జూన్ 6:** తెలంగాణలో వంజరి కులస్తులకు గతంలో ఉన్న షెడ్యూల్డ్ ట్రైబ్ (ఎస్టీ) హోదాను పునరుద్ధరించాలని, తక్షణ ఉపశమన చర్యగా వారిని డి.ఎన్.టి (డీనోటిఫైడ్ ట్రైబ్స్)గా గుర్తించాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం ప్రభుత్వాన్ని కోరాయి. అలాగే వంజరి కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాయి. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, 1978 వరకు ఎస్టీలుగా గుర్తింపు పొందిన వంజరి కులస్తులను ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా బీసీ-డి వర్గంలోకి మార్చడం వల్ల గత ఐదు దశాబ్దాలుగా సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణనలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్ది, వంజరి కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన వంజరి కుటుంబాల అభ్యున్నతి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి స్వయం ఉపాధి, విద్య, సంక్షేమ కార్యక్రమాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. వంజరి కుల ఆరాధ్య సంత్ భగవాన్ బాబా పుణ్యతిథిని అధికారికంగా నిర్వహించాలని, మహారాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి గోపీనాథ్ ముండేకు భారతరత్న పురస్కారం ప్రకటించి ఆయన జయంతి, వర్ధంతులను అధికారిక కార్యక్రమాలుగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ నెల 7న ఉప్పల్ బాగాయత్‌లో నిర్మించిన వంజరి కుల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు వంజరి కుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంఘ నాయకులు కోరారు. వంజరి కుల ఆత్మగౌరవ భవనం పూర్తిగా కులస్తుల విరాళాలతో నిర్మించబడిందని, గత ప్రభుత్వం ప్రకటించిన రూ.1 కోటి నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని తెలిపారు. భవన అభివృద్ధి, మౌలిక వసతుల కోసం అదనంగా రూ.5 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

అదేవిధంగా భవన నిర్మాణ ట్రస్టులో బీసీ సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం అన్ని నమోదిత వంజరి సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, పదవీకాలం ముగిసినా కొనసాగుతున్న వ్యక్తుల ఆధిపత్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్ నారాయణ, ఎరుగని హరినాథ్, ధాత్రికా కాశీనాథ్, యుగంధర్, కాలేరు సురేష్, ఎదుగని వెంకటేష్, శివప్రసాద్, రత్నం సంతోష్, అముద లక్ష్మణ్, మహదేవ్ ముండే తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

# ఎంఎంటీఎస్ ను ఉచితంగా నడపలేం - స్పష్టం చేసిన రైల్వేశాఖ

**ఎంఎంటీఎస్ లో ప్రయాణికులకు ఉచిత సేవలు అందించాలని కోరిన ప్రభుత్వం**

**తిరస్కరించిన రైల్వే బోర్డు**

**ఇప్పటికే తీవ్ర నష్టాల్లో ఉందని వెల్లడి**




ప్రాజెక్టులో రాష్ట్ర వాటా బకాయిలు చెల్లించాలని సూచనఎంఎంటీఎస్‌లో ఉచిత ప్రయాణ ప్రతిపాదనహైదరాబాద్ మహా నగర పరిధిలో ప్రయాణ సేవలందించే లోకల్ రైలు 'మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్'(ఎంఎంటీఎస్)లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు రైల్వే బోర్డు నిరాకరించింది. అంతేకాకుండా ఎంఎంటీఎస్? ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కొనసాగుతోందని, ఈ పథకాన్ని అమలు చేయలేమని బోర్డు తన అభిప్రాయం వ్యక్తం చేసింది. ఒకవేళ ఉచిత ప్రయాణ పథకాన్ని నిర్వహించాలంటే భవిష్యత్తులో అయ్యే అదనపు ఖర్చులతో పాటు ఇదివరకు వస్తున్న ఆపరేషన్ నష్టాలను కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరించవలసి ఉంటుందని షరతు పెట్టింది. కాగా జూన్ 2 నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావించింది.రైల్వే మంత్రితో సంప్రదించే యోచన : అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎంఎంటీఎస్ ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించిన వాటా బకాయిలను కూడా చెల్లించాలని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. ఈ మేరకు ఉన్నతాధికారులకు రైల్వేబోర్డు నుంచి లేఖ రావడంతో వారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాగా, నగరంలో మెట్రో ప్రాజెక్టులు, హైస్పీడ్ రైలు ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై సీఎం దిల్లీ వెళ్లే ఆలోచనలో ఉన్నారు. ఇదే సందర్భంలో ఎంఎంటీఎస్ వ్యవహారం గురించీ రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్?తో? చర్చించాలని భావిస్తున్నట్లు సమాచారం.గణనీయమైన ఆర్థిక భారం పడుతోంది : రాష్ట్రంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా వారి ప్రయాణ ఖర్చులను ప్రభుత్వమే ఆర్టీసీకి చెల్లిస్తోంది. ఈ తరహాలోనే ఎంఎంటీఎస్? ప్రయాణికుల వ్యయాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుందని, రాష్ట్ర అవతరణ దినోత్సవమైన జూన్? 2 నుంచి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావించింది. ఈ మేరకు రైల్వే బోర్డుకు ముసాయిదా ఎంవోయూ ద్వారా ప్రతిపాదనను వెల్లడించింది. దీన్ని పరిశీలించిన బోర్డు లిఖితపూర్వకంగా తన అభిప్రాయాన్ని తెలియజేసింది. ఎంఎంటీఎస్ రైళ్ల సేవల ద్వారా ఇప్పటికే అధిక ఆర్థిక భారం పడుతోందని వివరించింది.ఖర్చు ఘనం ఆదాయం శూన్యం : ఎంఎంటీఎస్ ద్వారా చేకూరుతున్న ఆర్థిక నష్టాలను రైల్వే బోర్డు గణాంకాల ద్వారా ప్రభుత్వానికి వివరణ ఇచ్చింది. ఈ మేరకు గత సంవత్సర ఆదాయ వ్యయాలను వెల్లడించింది. 2024-25లో ఎంఎంటీఎస్‌కు దాదాపు రూ.16.81 కోట్ల ఆదాయం వస్తే, నిర్వహణ కోసం ఏకంగా రూ.179 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపింది. అంటే ఒక్క సంవత్సరంలోనే ఏకంగా సుమారు రూ.162 కోట్లకు పైగా నష్టం వచ్చిందని బోర్డు వివరించింది. అంటే దాదాపు పదింతలు ఆర్థిక భారం పడుతోందని తెలిపింది.హామీ లేనిదే అమలు చేయలేం : ఎంఎంటీఎస్ ప్రాజెక్టుకు సంబంధించి రూ.490 కోట్లకు పైగా వాటా బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. ప్రతిపాదించిన పథకాన్ని అమలు చేయాలంటే భవిష్యత్తులో ప్రయాణ ఖర్చుల మాత్రమే కాకుండా ముందుగా పూర్తి బకాయిలు కూడా చెల్లించాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏ రకమైన ఆర్థిక హామీలు లేకుండా ఉచిత ప్రయాణ సేవ పథకాన్ని నిర్వహించడం సాధ్యం కాదని రైల్వే బోర్డు స్పష్టం చేసింది.అయితే, ఎంఎంటీఎస్‌ప్రాజెక్ట్ నిర్వహణలో మూడింట రెండొంతులు రాష్ట్ర ప్రభుత్వం, మూడింట ఒక వంతు రైల్వే బోర్డుకు వాటా ఉంది. అయితే ఫేజ్ -2 ద్వారా చేపట్టిన నిర్మాణానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లింపుల్లో జాప్యం కారణంగా పలు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఎంఎంటీఎస్ ద్వారా హైదరాబాద్ మహా నగరం మొత్తంగా 44 స్టేషన్లు, 90 కిలోమీటర్ల పరిధిలో ప్రయాణ సేవలు అందిస్తోంది.

# కొండాపూర్ కిమ్స్ వైద్యులు ఘనత

**అరుదైన లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీ సక్సెస్**

**గతంలో క్రానిక్ కాల్సిఫిక్ ప్యాంక్రియాటిటిస్‌కు ఓపెన్ సర్జరీ చేయించుకున్న మహిళ**

**ఇదే రోగికి లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీ చేసి ప్రాణాలు కాపాడిన డాక్టర్లు**

శస్త్రచికిత్స విజయం అత్యంత అరుదుగా పేర్కొన్న వైద్యులుగతంలో పాంక్రియాటిక్ శస్త్రచికిత్స జరిగిన వ్యక్తికే అరుదైన లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీని కొండాపూర్? కిమ్స్ హాస్పిటల్స్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. ఈ సర్జరీకు సంబంధించిన వివరాలను శస్త్రచికిత్స చేసిన కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా.సీ.హెచ్.నవీన్ కుమార్ తెలిపారు.మరో శస్త్రచికిత్స అవసరమైంది : హైదరాబాద్ నగరానికి చెందిన ఓ 52 ఏళ్ల మహిళ గతంలో క్రానిక్ కాల్సిఫిక్ ప్యాంక్రియాటిటిస్‌కు ఓపెన్ శస్త్రచికిత్స చేయించుకున్నారని నవీన్? కుమార్ పేర్కొన్నారు. అదే రోగికి ఇప్పుడు లాపరోస్కోపిక్ విప్పుల్ సర్జరీ చేసి ప్రాణాలు కాపాడామని ఆయన వెల్లడించారు. రోగి అప్పటికే లేటరల్ ప్యాంక్రియాటికోజేజునోస్టమీ శస్త్రచికిత్స చేయించుకున్నారని చెప్పారు. అయితే ఆమె పచ్చకామెర్లు (జాండిస్), వాంతులతో ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. సమగ్ర వైద్య పరీక్షల అనంతరం, ప్యాంక్రియాస్‌లో మిగిలిన రాళ్లు (రిమ్నెంట్ ప్యాంక్రియాటిక్ స్టోన్స్) డ్యూడెనమ్‌లో అడ్డంకిగా (డ్యూడెనల్ అబ్స్ట్రక్షన్) ఉన్నట్లు వైద్యులు గుర్తించారని అన్నారు. దీనితో మరొక శస్త్రచికిత్స అవసరమైందని వివరించారు.ఆ సమస్యలు ఉండటంతో మరింత క్లిష్టం : గతంలో నిర్వహించిన ఓపెన్ శస్త్రచికిత్స కారణంగా శరీర నిర్మాణంలో మార్పులు రావడం, అంటుకునే కణజాలం (అడ్హీజన్స్) ఏర్పడటం వంటి సమస్యలు ఉన్నాయని ఆయన తెలిపారు. దీంతో ఈ శస్త్రచికిత్స అత్యంత క్లిష్టంగా మారిందని వెల్లడించారు. అయినప్పటికీ మినిమల్లి ఇన్వేసివ్ విధానాన్ని ఎంచుకున్నామని అన్నారు. లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స (ప్యాంక్రియాటోడ్యూడెనెక్టమీ)ను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు.కొత్త విధానంలో రీకన్స్ట్రక్షన్ : మునుపటి ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సలు చేసిన రోగుల్లో తిరిగి లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స చేయడం అత్యంత అరుదైన విషయమని ఆయన అన్నారు. శరీర నిర్మాణంలో మార్పులు, అంటుకునే కణజాలం, శస్త్రచికిత్స మార్గాల మార్పులు వంటి కారణాల వల్ల ఇలాంటి శస్త్రచికిత్సలు చాలా సవాలుగా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంలో, రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా గ్యాస్ట్రోఇంటెస్టినల్ కంటిన్యూయిటీని కొనసాగించేందుకు వైద్యులు ఒక కొత్త విధానంలో రీకన్స్ట్రక్షన్ చేపట్టారని వివరించారు. ఈ నూతన విధానమే శస్త్రచికిత్స విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించిందని వెల్లడించారు.తిరిగి ఆపరేషన్ చేయడం చాలా అరుదు : గతంలో నిర్వహించిన ఓపెన్ ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్స తరువాత లాపరోస్కోపిక్ విధానంలో తిరిగి ఆపరేషన్ చేయడం చాలా అరుదైనదిగా అభివర్ణించారు. దీనికి ఖచ్చితమైన ప్రణాళిక, ఉన్నత స్థాయి నైపుణ్యం అవసరమని ఆయన అన్నారు. ఆపరేషన్ సమయంలో తక్షణ నిర్ణయాలు అవసరం అని తెలిపారు.ఈ శస్త్రచికిత్స విజయం అత్యంత అరుదు : శస్త్రచికిత్స అనంతరం రోగి ఆరోగ్యంగా కోలుకొన్నారని డా.నవీన్ కుమార్ అన్నారు. వారం రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారని తెలిపారు. ప్రస్తుతం ఆమె స్థితి




స్థిరంగా ఉందని చెప్పారు. ఫాలోఅప్‌లో బాగానే ఉన్నట్లు వెల్లడించారు. మొదటగా శస్త్రచికిత్స చేసిన రోగిలో లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించిన ఈ ఘటన చాలా అరుదైనదిగా ఆయన పేర్కొన్నారు. ఇది మినిమల్లి ఇన్వేసివ్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ శస్త్రచికిత్సల్లో సాధించిన పురోగతిని ప్రతిబింబిస్తోందని వెల్లడించారు."మునుపటి ప్యాంక్రియాటిక్ శస్త్రచికిత్సలు చేసిన రోగుల్లో తిరిగి లాపరోస్కోపిక్ విప్పుల్ శస్త్రచికిత్స చేయడం అత్యంత అరుదైన విషయం. శరీర నిర్మాణంలో మార్పులు, అంటుకునే కణజాలం, శస్త్రచికిత్స మార్గాల మార్పులు వంటి కారణాల వల్ల ఇలాంటి శస్త్రచికిత్సలు చాలా సవాలుగా ఉంటాయి. ఈ సందర్భంలో, రోగి శరీర నిర్మాణానికి అనుగుణంగా గ్యాస్ట్రోఇంటెస్టినల్ కంటిన్యూయిటీని కొనసాగించేందుకు వైద్యులు ఒక కొత్త విధానంలో రీకన్స్ట్రక్షన్ చేపట్టారు. ఈ నూతన విధానమే శస్త్రచికిత్స విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించింది" - డా.సీ.హెచ్.నవీన్ కుమార్, కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్

# శ్రీవారి వైభోగం - మే నెల అన్నింట్లో ఆల్ టైం రికార్డు

**మొత్తం 25.46 లక్షల మందికి దర్శనభాగ్యం**

**దాదాపు 1.12 కోట్ల మందికి అన్నప్రసాదాల వితరణ**

**1.21 కోట్ల లడ్డూల విక్రయం**

ఒక నెలలోనే రూ.120 కోట్లకు చేరిన హుండీ ఆదాయంతిరుమల శ్రీవారిని మే నెలలో 25,46,168 మంది భక్తులు దర్శించుకున్నారు. 2025 మేతో పోలిస్తే అదనంగా 2,85,308 మందికి దర్శన భాగ్యాన్ని కల్పించింది. తిరుమల తిరుపతి దేవస్థాన చరిత్రలోనే ఇదో అరుదైన రికార్డుగా భావించవచ్చు. ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ తో భక్తుల కదలికలను నిరంతరం స్వయంగా పర్యవేక్షించడంతో పాటు ఇంత మంది భక్తులకు నిర్విఘ్నంగా దర్శన భాగ్యాన్ని కల్పించడం సాధ్యమైంది.ఒక నెలలోనే రూ.120 కోట్ల ఆదాయం: అదే విధంగా నిత్య కైంకర్యాలు కొనసాగిస్తూనే క్యూలైన్ ఆగకుండా అన్ని రకాలైన చర్యలను చేపట్టారు. మొత్తం 1.12 కోట్ల మందికి అన్నప్రసాదాలను అందించారు. 2025 మే నెలతో పోలిస్తే 15.71 లక్షలు అధికం. మే నెలలో హుండీ ఆదాయం రూ. 120 కోట్లకు చేరింది. లడ్డూ విక్రయాలు సైతం భారీ ఎత్తున 1.21 కోట్ల వరకు జరిగాయి. ఇక రికార్డు స్థాయిలో 14,38,385 మంది భక్తులు తలనీలాలను సమర్పించారు. అదే విధంగా బంగారం, వెండి డాలర్ల అమ్మకం, రిసెప్షన్ ఆదాయం సహా వివిధ విభాగాల్లో సైతం టీటీడీ కొత్త రికార్డును నమోదు చేయడం విశేషం.సమయానికి అనుగుణంగా పక్కా ప్రణాళికతోతిరుమలలోని ముఖ్యంగా పోటు విభాగానికి గాను మే నెలలో రోజుకు సగటున దాదాపు 4.08 లక్షల లడ్డూలను తయారు చేసింది. లడ్డూ నాణ్యత కాపాడేందుకు 2 ఏఐ ఆధారిత కలర్ సార్టింగ్ యంత్రాలను పోటులో ఉపయోగించారు.మే మాసంలో ప్రధానంగా ఒక రోజులో సర్వదర్శనానికి అత్యధికంగా దాదాపు 176 గంటల 24 నిమిషాలను కేటాయించారు.ఇక నడక మార్గం నుంచి వచ్చేవారిని పర్యవేక్షణతో అంచనా వేసి, అన్ని విధాలైన చర్యలను చేపట్టారు.అంతేకాకుండా క్యూలైన్లలో భక్తుల రద్దీ, కదలికల్ని అనుక్షణం గమనించారు.కంపార్టుమెంట్లలోకి ప్రవేశించిన దగ్గర మొదలు గంటల గంటల సమయాన్ని గణిస్తూ, ఎస్?ఈడీ, ఎస్ఎస్?డీ టోకెన్ల ఎంట్రీలను కెమెరా ఫుటేజీలతో బేరీజు వేసుకుంటూ స్వామివారికి దర్శనానికి పంపించారు.దాంతో దీని



ఫలితంగా మే 24వ తేదీన ఒక్క రోజే అత్యధికంగా 98,058 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నెలలోనే దాదాపు నాలుగు సార్లు 90,000 మార్కును దాటేయడం విశేషం.ఇక స్వామివారి హుండీ ఆదాయాన్ని పరిశీలిస్తే మే 3వ తేదీన అత్యధికంగా రూ.5.06 కోట్లు రావడం గమనార్హం.ఈ విధంగా రోజుకు సగటున 4.08 లక్షల లడ్డూలు విక్రయమైనట్లు ఓ అంచనా ఉంది.మే నెలలో 23 లక్షల భక్తులు.. రూ.110 కోట్ల ఆదాయం..తిరుమలకు పోటెత్తిన భక్తులు.. సర్వదర్శనానికి 20 గంటలు!

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు భారీ నగదు ప్రోత్సాహకాలు

**జాడి మాధవరావు 50వ జన్మదిన వేడుకల్లో ప్రతిభావంతులకు పురస్కారాలు**




**హైదరాబాద్, వార్తసంధ్య:** 'అమ్మ నాన్న పిల్లలు చారిటబుల్ ట్రస్ట్' మేనేజింగ్ ఛైర్‌పర్సన్ మరియు 'ఆదరణ సొసైటీ' వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీ జాడి మాధవరావు గారి 50వ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భారీ నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించి ప్రతిభ కనబరిచిన 25 మంది విద్యార్థులను ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల్లో 12 మందికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయగా, మరో 13 మందికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అంతర్జాతీయ వ్యాపారవేత్త, ఏటీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ అశోక్ ముస్తాపురే ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ శ్రీ బాసు నాయక్, సరూర్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ), కర్మన్‌ఘాట్ మరియు బహదూర్‌గూడ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ జాడి మాధవరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, అలాంటి ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని అన్నారు. తన 50వ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఇకపై ప్రతి విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రథమ స్థానాల్లో నిలిచే ప్రతిభావంతులైన విద్యార్థులను తమ ట్రస్ట్ తరపున గుర్తించి నగదు ప్రోత్సాహకాలు అందజేస్తామని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ నిర్ణయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.

## దేవ్‌జీని పరామర్శించిన టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత

**కొంపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మావోయిస్టు నేత ఆరోగ్య పరిస్థితిపై ఆరా**



**హైదరాబాద్, వార్తసంధ్య:** మావోయిస్టు పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి తిప్పిరి తిరుపతి (దేవ్‌జీ)ని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత శుక్రవారం పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న దేవ్‌జీ కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దేవ్‌జీ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న కవిత స్వయంగా ఆసుపత్రికి వెళ్లి ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవ్‌జీ త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో సాధారణ జీవితంలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. అలాగే ఆయనకు అత్యుత్తమ వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యులను కోరారు. దేవ్‌జీ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో కూడా మాట్లాడి ధైర్యం చెప్పారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు మావోయిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన దేవ్‌జీ ఇటీవల జనజీవన స్రవంతిలో కలిసిన విషయం తెలిసిందే. ఆయన అనారోగ్యానికి గురైన నేపథ్యంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక వర్గాల నేతలు పరామర్శిస్తున్నారు.

## ఏపీకి పెట్టుబడులే లక్ష్యం- రష్యా వేదికగా లోకేష్ ప్రసంగం

**రష్యాలో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరంలో మంత్రి లోకేశ్ ప్రసంగం**

**పెట్టుబడిదారులుగా కాకుండా భాగస్వాములుగా ఏపీకి రావాలని ఆహ్వానం**

**2047 నాటికి ఏపీని 2.5 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్**

**2030 నాటికి 100 బిలియన్ డాలర్ల భారత్-రష్యా ద్వైపాక్షిక వాణిజ్యమే లక్ష్యం**

**ఏపీలో స్పేస్, ఏరోస్పేస్, సెమీకండక్టర్ల రంగాల్లో పెట్టుబడులపై దృష్టి**




రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ఆర్థిక ఫోరం వేదికగా ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. కేవలం పెట్టుబడిదారులుగానే కాకుండా, రాష్ట్ర అభివృద్ధిలో దీర్ఘకాలిక భాగస్వాములుగా పాలుపంచుకోవాలని రష్యా పారిశ్రామికవేత్తలను, దిగ్గజ సంస్థలను ఆయన సాదరంగా ఆహ్వానించారు.భారత్-రష్యాల మధ్య బంధం కేవలం వ్యాపార ఒప్పందాలకే పరిమితం కాదని, అది ఒక దృఢమైన అనుబంధమని లోకేష్ పేర్కొన్నారు. భిలాయ్ స్టీల్ ప్లాంట్ నుంచి గగన్‌యాన్ ప్రాజెక్టు వరకు అనేక కీలక సందర్భాల్లో రష్యా భారత్‌కు అండగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నిర్దేశించుకున్న 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యాన్ని చేరుకోవడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని, 2047 నాటికి రాష్ట్ర జీడీపీని 2.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యమని వివరించారు. వెయ్యి కిలోమీటర్ల మేర విస్తరించిన సుదీర్ఘ తీరప్రాంతం, ఆరు ప్రధాన ఓడరేవులు, పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నిరంతరాయ విద్యుత్ సరఫరా వంటి అంశాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఎంతో అనువైనవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన భరోసా ఇచ్చారు.అంతరిక్ష రంగంలో ఇరు దేశాల మధ్య సహకారం నూతన శిఖరాలకు చేరుతోందని, భారత దేశపు ఏకైక స్పేస్‌పోర్ట్ శ్రీహరికోట ఆంధ్రప్రదేశ్‌లోనే ఉందని లోకేష్ గుర్తుచేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 'స్పేస్ సిటీల'లో పెట్టుబడులు పెట్టాలని 'రోస్‌కోస్మోస్' వంటి ప్రతిష్టాత్మక సంస్థలను ఆహ్వానించారు. ఏరోస్పేస్, సెమీకండక్టర్లు, ఇంధన రంగాల్లో రష్యన్ సంస్థలకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఉమ్మడిగా ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

# రాత్రంతా ఉంచిన పాల గిన్నెను 2 నిమిషాల్లో ఎలా శుభ్రం చేయాలో మీకు తెలుసా



రాత్రంతా బయట ఉంచిన పాల గిన్నెను శుభ్రం చేయడం నిజంగా కష్టమే. పాలు విరిగిపోయినప్పుడు లేదా పాలతో గిన్నెలో అలాగే ఉంచినప్పుడు పాలకు సంబంధించిన మీగడ గిన్నెకు గట్టిగా అతుక్కుపోతుంది. సాధారణంగా కడగడం చాలా కష్టం. అయితే, ఈ మరకలను సులభంగా తొలగించగల కొన్ని ఇంటి నివారణలు ఉన్నాయి.

**1. వేడి నీరు, బేకింగ్ సోడా :** ముందుగా గిన్నెలో వేడి నీటిని పోసి కాసేపు నాననివ్వండి. తరువాత 1 టీస్పూన్ బేకింగ్ సోడా చల్లుకోండి. కొద్దిసేపు ఆగి స్పాంజ్ లేదా గట్టి బ్రష్ తో రుద్దండి. ఇది ఎండిన పాలు సులభంగా బయటకు రావడానికి సహాయపడుతుంది.

**2**. నిమ్మరసం లేదా వెనిగర్ ఉపయోగించడం నిమ్మరసం లేదా తెల్ల వెనిగర్ సహజ ఆమ్లంగా పనిచేస్తుంది. ఇది పాల ప్రోటీన్ పొరపై బాగా పనిచేస్తుంది. గిన్నెలో నిమ్మరసం లేదా వెనిగర్ పోసి 15-20 నిమిషాలు అలాగే ఉంచండి. తర్వాత స్క్రబ్ చేసి శుభ్రం చేసుకోండి.


**3**. ఉప్పు, వేడి నీరు ఒక సహజ స్క్రబ్బర్. గోరువెచ్చని నీటితో కొంచెం ఉప్పు కలిపి, ఆ నీటితో గిన్నెను నానబెట్టండి. తర్వాత ఎండిన పాలను రుద్దండి.

**4**. ఒక గిన్నెలో కొంచెం డిష్ వాషింగ్ లిక్విడ్, వేడి నీటిని పోసి రాత్రంతా నానబెట్టినట్లయితే, ఉదయం సులభంగా కడగవచ్చు. పాల వాసనను కూడా తొలగిస్తుంది.

**5**. పాత టూత్ బ్రష్ లేదా స్పాంజ్ ఉపయోగించండి . మీ చేతులు చేరలేని మూలల్లో పాత టూత్ బ్రష్ ఉపయోగించండి. ఇది మూలలకు అంటుకున్న ఎండిన పాలను తొలగించడానికి కూడా సహాయపడుతుంది. కడిగిన తర్వాత పూర్తిగా ఆరబెట్టండి. లేకుంటే వాసన అలాగే ఉండవచ్చు. రాత్రిపూట పాల పాత్రను బాగా కడిగితే తర్వాత ఎలాంటి సమస్యలు ఉండవు. పాలను స్టీల్ లేదా గాజు పాత్రలో నిల్వ చేయడం వల్ల శుభ్రం చేయడం సులభం. ఎండిన పాల గిన్నెను రాత్రంతా శుభ్రం చేయడం మొదట్లో కష్టంగా అనిపించవచ్చు. కానీ పైన పేర్కొన్న చిట్కాలను పాటిస్తే అది సులభం అవుతుంది. మీకు కావలసిందల్లా కొంచెం ఓపిక, సరైన విధానం. మీరు క్రమం తప్పకుండా శుభ్రపరచడం కొనసాగిస్తే, భవిష్యత్తులో మీరు అలాంటి సమస్యలను ఎదుర్కోవాల్సిన అవసరం ఉండదు.

# కష్టాలతో విసిగిపోయారా.. నిజంగా జీవితాన్ని గెలవాలంటే ఇలా మారి చూపించండి

జీవితంలో ఎత్తు పల్లాలు అనివార్యం. అవి మనల్ని బలపరిచే మెట్ల వంటివి. వైఫల్యాలను సవాళ్లుగా, విజయాలను ప్రోత్సాహంగా భావించండి. సానుకూల దృక్పథం, కృషి, సహనంతో జీవిత నిచ్చెనను ఎక్కండి. ప్రతి అడుగు మీకు కొత్త గమ్యాన్ని చూపిస్తుంది. ఈ ఎత్తు పల్లాలను స్వీకరించి, మీ జీవితాన్ని విజయవంతంగా, సంతోషంగా మార్చుకోండి. ఇందుకు ఈ సీక్రెట్ టిప్స్ మీకు ఉపయోగపడతాయి. జీవితం ఒక సుదీర్ఘ ప్రయాణం, ఇందులో ఎత్తు పల్లాలు సహజం. విజయాలు, వైఫల్యాలు, సంతోషాలు, బాధలు ఈ ప్రయాణంలో భాగమే. ఈ ఎత్తు పల్లాలు జీవిత మెట్లపై మనం ఎక్కే మెట్ల వంటివి. ప్రతి అడుగు మనల్ని కొత్త అనుభవాల వైపు, బలమైన వ్యక్తిత్వం వైపు నడిపిస్తుంది. జీవితంలోని ఈ ఎత్తు పల్లాలను సానుకూల దృక్పథంతో ఎలా స్వీకరించాలో, అవి మనల్ని ఎలా ఉన్నతంగా నిలబెడతాయో తెలుసుకుందాం.



ఎత్తు పల్లాలు.. జీవితంలో అనివార్యం

జీవితంలో ప్రతి వ్యక్తి విజయాలను, వైఫల్యాలను ఎదుర్కొంటాడు. విజయం మనలో ఆత్మవిశ్వాసాన్ని నింపితే, వైఫల్యం ఓపికను, సహనాన్ని నేర్పిస్తుంది. ఈ రెండూ లేకపోతే జీవితం రుచిహీనంగా మారుతుంది. ఒక విజయవంతమైన వ్యక్తి కథను చూస్తే, దాని వెనుక అనేక వైఫల్యాలు, సవాళ్లు దాగి ఉంటాయి. ఉదాహరణకు, థామస్ ఎడిసన్ వేల సార్లు విఫలమైన తర్వాతే బల్బును కనుగొన్నాడు. వైఫల్యం అతన్ని ఆపలేదు, బదులుగా కొత్త మార్గాలను చూపించింది.

వైఫల్యం: ఒక అవకాశం

వైఫల్యాన్ని చాలామంది ప్రతికూలంగా చూస్తారు. కానీ, వైఫల్యం అనేది కొత్త పాఠాలను నేర్చుకునే అవకాశం. ఇది మన బలహీనతలను తెలియజేస్తుంది, మనలో మెరుగైన వ్యక్తిని తీర్చిదిద్దుతుంది. ఒక పరీక్షలో విఫలమైన విద్యార్థి మరింత కష్టపడి, తన లోపాలను సరిదిద్దుకుని విజయం సాధిస్తాడు. అదే విధంగా, వ్యాపారంలో నష్టపోయిన వ్యక్తి కొత్త వ్యూహాలతో మరింత బలంగా తిరిగి వస్తాడు. వైఫల్యం మనల్ని నిరాశపరచడానికి కాదు, మనల్ని మరింత దృఢంగా నిలబెట్టడానికి.

విజయం: కృషి ఫలం

విజయం అనేది కష్టపడిన వారికి లభించే బహుమతి. ఇది మనలో ఆనందాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అయితే, విజయం శాశ్వతం కాదు. దానిని నిలబెట్టుకోవడానికి నిరంతర కృషి, నేర్చుకునే తత్వం అవసరం. ఒక విజయవంతమైన వ్యక్తి తన విజయాన్ని గర్వంగా భావించకుండా, దానిని మరింత ఎదగడానికి ఒక మెట్టుగా భావించాలి. ఉదాహరణకు, ఒక క్రీడాకారుడు ఒక పోటీలో గెలిచిన తర్వాత మరింత కష్టపడి, కొత్త లక్ష్యాలను సాధిస్తాడు.


ఎత్తు పల్లాలను స్వీకరించడం

జీవితంలో ఎత్తు పల్లాలను సానుకూల దృక్పథంతో స్వీకరించడం చాలా ముఖ్యం. ఈ క్రింది చిట్కాలు ఈ ప్రయాణంలో సహాయపడతాయి. ప్రతి అనుభవం ఒక పాఠంగా భావించండి. వైఫల్యం వచ్చినప్పుడు నిరాశ చెందకుండా, దాని నుండి నేర్చుకోండి. చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకోండి. ప్రతి లక్ష్య సాధన మీకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. విజయం రాత్రికి రాత్రి సాధ్యం కాదు. సహనంతో, క్రమశిక్షణతో ముందుకు సాగండి. కుటుంబం, స్నేహితులు, గురువుల మద్దతు తీసుకోండి. వారి సలహాలు, ప్రోత్సాహం మీ బలాన్ని పెంచుతాయి. ఒత్తిడిని తగ్గించడానికి ధ్యానం, వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించండి.

జీవితాన్ని ఇలా గెలిచేయండి..

జీవితం అనేది ఒక నిచ్చెన లాంటిది. ప్రతి ఎత్తు, ప్రతి పల్లం ఒక మెట్టు. ఈ మెట్లను ఎక్కడానికి ధైర్యం, సహనం, నమ్మకం అవసరం. ఒక మెట్టు జారినా, మరో మెట్టును గట్టిగా పట్టుకోవడం నేర్చుకోవాలి. ప్రతి అడుగు మనల్ని ఉన్నత శిఖరాల వైపు నడిపిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యాపారి నష్టాలను ఎదుర్కొని, కొత్త వ్యూహాలతో మళ్లీ విజయం సాధించాడు. అదే విధంగా, ఒక విద్యార్థి పరీక్షలో విఫలమై, మరింత కష్టపడి ఉత్తీర్ణత సాధించాడు. ఈ కథలు మనకు ఒకటే చెబుతాయి. మనం ఆగిపోకపోతే ఎత్తు పల్లాలు మనల్ని ఆపలేవు

# ఆవులు ప్లాస్టిక్ తింటే ఏమవుతుందో తెలుసా దీని గురించి మీరెప్పుడైనా ఆలోచించారా



నిత్య జీవితంలో ప్లాస్టిక్ ఒక భాగమైపోయింది. దీని వాడకాన్ని మనం తగ్గించలేకపోతున్నాం. ఆహార వినియోగం, నిల్వ నుంచి ప్రతి దశలో ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తున్నాం. అంతేకాదు మనం ప్లాస్టిక్ వాడిన తర్వాత ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నాం కూడా. అయితే మన చుట్టూ ఉన్న జంతువులు తెలియకుండానే ఈ కవర్లను తిని.. ప్లాస్టిక్ ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందనేది కాదనలేని సత్యం. అయినప్పటికీ మనం నిత్య జీవితంలో దాని వాడకాన్ని తగ్గించలేకపోతున్నాం. మనం ఆహార వినియోగం, నిల్వ నుంచి ప్రతి దశలో ప్లాస్టిక్‌ను ఉపయోగిస్తున్నాం. అంతేకాదు మనం ప్లాస్టిక్ వాడిన తర్వాత ఎక్కడ పడితే అక్కడ పారేస్తున్నాం కూడా. అయితే మన చుట్టూ ఉన్న జంతువులు తెలియకుండానే ఈ కవర్లను తిని ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇందులో ఆవుల సంఖ్య అత్యధికం. ఇది ఇప్పటి సమస్య కాదు.. ఈ సమస్య చాలా సంవత్సరాలుగా ఆవుల పాలిట శాపంగా మారింది. ఆవులు ప్లాస్టిక్ తినడం మంచిది కాదని అందరికీ తెలుసు. కానీ వాటిని ఎలా నిరోధించాలో? ఆవులకు ఎలాంటి ప్రమాదాన్ని కలిగిస్తుందో? చాలా మందికి అవగాహన లేకపోవడం దురదృష్టకరం. ఆవులు ప్లాస్టిక్ తింటే ఏమవుతుందో ఇక్కడ తెలుసుకుందాం.. నేటికీ ప్లాస్టిక్ అనేక పశువుల మరణాలకు కారణమవుతోంది. మేత మేసే సమయంలో ఆవులు రోడ్లపై పడి ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తినే ధోరణి పెరుగుతోంది. ప్లాస్టిక్ తినడం వల్ల చనిపోయిన జంతువుల కళేబరాలను కాకులు, గద్దలు కూడా ముట్టుకోవు. అంతేకాకుండా ఆవులను ప్లాస్టిక్ తినవద్దని మనం చెప్పలేం. వాటికి మానవ భాష అర్థంకాదు. అయితే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా మనం ఈ సమస్యను నివారించవచ్చు. మనం వీలైనంత వరకు ప్లాస్టిక్‌లోని ఆహారాన్ని తినాలి. జంతువులకు ఆహారంగా వాటిని పారవేయడం మానేయాలి. అప్పుడే ఇలాంటి సమస్యలు తీవ్రతరం కాకుండా నిరోధించవచ్చు. ఆవులు ప్లాస్టిక్ తింటే ఏమవుతుందంటే..? కడుపులో ప్లాస్టిక్‌లు జీర్ణం కావు. దీనివల్ల పశువులు చనిపోతాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు తినడం వల్ల చనిపోయే జంతువులలో, ఆవుల సంఖ్య మరింత ఎక్కువ. ఆవుల దవడల నిర్మాణం వాటికి ఏమి తింటున్నాయో తెలియదని విధంగా ఉంటుంది. అవి ఆహారాన్ని నమిలినప్పటికీ, వాటి పెదవులు వ్యర్థాలను గుర్తించేంత సున్నితంగా ఉండవు. దీని కారణంగా ఆవులు ప్లాస్టిక్‌ను తింటున్న విషయాన్ని అవి గ్రహించలేవు. పైగా వాటికి వాంతులు చేసుకోవడం రాదు. దీంతో ఆవుల కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి ఇతర ఆహారాన్ని తినడానికి వీలు లేకుండా ఉంటుంది. ప్లాస్టిక్ మాత్రమే కాదు చనిపోయిన ఆవుల కడుపులో పదునైన ఇనుప ముక్కలు, మేకులు కూడా కనిపిస్తాయి. ఇటువంటి లోహ వ్యర్థాలు ఆవుల కడుపు, ప్రేగులలోకి ప్రవేశించి వాటి ప్రాణాలను హరిస్తున్నాయి.

# సైలెంట్ కిల్లర్ ప్రాణాలు తీస్తుంది వేసవిలో మీ గుండె జర భద్రం ఎందుకంటే



శీతాకాలంలోనే కాదు, వేసవిలో కూడా గుండె ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.. గుండెపోటు ప్రమాదం వేసవిలో ఎంత ఉంటుందో శీతాకాలంలో కూడా అంతే ఉంటుంది. కాబట్టి, ఇప్పటికే గుండె రోగులుగా ఉన్నవారు వేసవిలో కూడా తమ గుండె ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవిలో గుండెపై ఎక్కువ ఒత్తిడి కలిగేలా ఎలాంటి పనులు చేయకూడదు.. ఇది కాకుండా, వేసవిలో గుండెపోటు కేసులు.. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇంకా ఏమి చేయాలి.. నిపుణులు ఏం చెబుతున్నారు.. ఈ వివరాలను తెలుసుకోండి.. వేసవిలో ఎక్కువసేపు ఎండలో ఉండి కష్టపడి పనిచేసే వారికి గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది.. చిన్న నిర్లక్ష్యం కారణంగా మిమ్మల్ని ఆసుపత్రిలో చేర్చే ప్రమాదం ఉంది. అందువల్ల, వేసవితోపాటు శీతాకాలంలో గుండె ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. వేసవిలో మీ ఆహారం, జీవనశైలిలో స్వల్ప మార్పులు చేయడం ద్వారా, మీరు మీ హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. శీతాకాలంలో గుండె ధమనులు ప్రభావితమైనట్లే, వేసవిలో కూడా అవే ప్రభావితమవుతాయి. రెండింటికీ కారణాలు ఖచ్చితంగా భిన్నంగా ఉన్నప్పటికీ.. గుండె సమస్యలు మాత్రం పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.. కాబట్టి, వేసవిలో కూడా గుండె ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచిస్తున్నారు.

**వేసవిలో పెరుగుతున్న గుండె సమస్యలు.. నిపుణులు ఏం చెబుతున్నారంటే..**

వేసవిలో ఎక్కువసేపు ఎండలో ఉండటం గుండె ఆరోగ్యానికి మంచిది కాదని సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ సునీల్ కత్యాల్ అంటున్నారు. ఇది మీ శరీరాన్ని వేడి చేస్తుంది.. ఈ పరిస్థితుల్లో శరీరాన్ని చల్లగా ఉంచడానికి, శరీరంలోని అన్ని భాగాలకు రక్తాన్ని సరఫరా చేయడానికి గుండె ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. అంటే గుండె వేగంగా కొట్టుకుటుంది.. దీనివల్ల గుండెపై మరింత భారం పెరుగుతుంది. ఇది కాకుండా, మీరు ఎక్కువగా పని చేస్తే, మీకు చెమట ఎక్కువగా పడుతుంది.. దీంతో మీరు డీహైడ్రేషన్ బాధితుడిగా కూడా మారవచ్చు. అలాంటి పరిస్థితులలో గుండెపై ఒత్తిడి కూడా పెరుగుతుంది. దీని కారణంగా, గుండె రోగులకు ఆంజినా (ఛాతీలో నొప్పి, ఒత్తిడి లేదా బిగుతుగా అనిపించే అనుభూతి), గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. అందువల్ల, మీ శరీరం వేడెక్కకుండా కాపాడుకోవడం చాలా ముఖ్యం.. ఎక్కువ వ్యాయామం లేదా పని చేయడం ప్రమాదకరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.

**మీ హృదయాన్ని జాగ్రత్తగా చూసుకోండి..**

వేసవిలో మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్ గా ఉంచుకోవడం ద్వారా మంచి గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. దీని కోసం, ఎక్కువసేపు ఎండలో ఉండకండి.. మీ ఆహారాన్ని మార్చుకోండి. వేసవిలో చాలా తేలికైన, సులభంగా జీర్ణమయ్యే ఆహారాన్ని తినాలి. ఆహారంలో ఎక్కువ ద్రవ పదార్థాలు ఉండాలి. కాలానుగుణ పండ్లను తినడం ద్వారా కూడా మీరు హైడ్రేటెడ్‌గా ఉండగలరు.

**మద్యం ధూమపానం నుండి దూరంగా ఉండండి**

దీనితో పాటు, ఎండాకాలంలో మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలి.. మద్యం %-% పొగాకు కూడా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఎండలో చల్లగా ఉండటానికి ప్రయత్నించండి. దీనితో పాటు, ఒత్తిడికి దూరంగా ఉండండి. కొన్ని సందర్భాల్లో ఛాతీలో అసౌకర్యం, నొప్పి.. తీవ్ర అలసట.. లాంటివి గమనిస్తే వెంటనే మీ వైద్యుడిని సంప్రదించండి..

# అరటి కాండంలో దాగిన ఆరోగ్య రహస్యం.. కిడ్నీ వ్యాధులున్న వారికి ఇది దివ్యౌషధం



అరటి కాండం జీర్ణక్రియ, మూత్రపిండాల ఆరోగ్యం, బరువు నిర్వహణ, రక్తపోటు నియంత్రణకు అద్భుతమైన ఆహారం. ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్స్ కలిగి వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుతుంది. రోజువారీ ఆహారంలో చేర్చడం ఎంతో ప్రయోజనకరం. మొండి వ్యాధులను సైతం తరిమికొట్టేయగల శక్తి దీనికుంది. పలు రకాల ఆరోగ్య సమస్యలకు దీంతో చెక్ పెట్టేయొచ్చు. ఏ సమస్యలకు ఇది ఎలా పనిచేస్తుందో తెలుసుకుందాం.. వేసవిలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సహజంగా దొరికే ఆహార పదార్థాలు కీలక పాత్ర పోషిస్తాయి. అరటి కాండం అటువంటి ఆరోగ్య గని. ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉన్న ఈ పదార్థం జీర్ణక్రియ, మూత్రపిండాల ఆరోగ్యం, బరువు నిర్వహణకు అద్భుతంగా తోడ్పడుతుంది. సులభంగా లభించే ఈ ఆహారాన్ని రోజువారీ జీవనంలో చేర్చి శరీరాన్ని ఉత్తేజపరుచుకోండి.

**పోషక విలువలు**

అరటి కాండం నీటి శాతం (95%) ఎక్కువగా కలిగి తక్కువ కేలరీలు (100 గ్రా.కు 30 కేలరీలు) అందిస్తుంది. ఫైబర్ (1.5-2 గ్రా./100 గ్రా.), పొటాషియం (300-400 మి.గ్రా.), విటమిన్ బి6, విటమిన్ సి సమృద్ధిగా ఉంటాయి. యాంటీఆక్సిడెంట్స్, ఖనిజాలు కలిగి శరీర ఆరోగ్యానికి తోడ్పడుతుంది.

**జీర్ణక్రియకు సహాయం**

అధిక ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నివారిస్తుంది. గట్ బ్యాక్టీరియా సమతుల్యం చేస్తుంది. కడుపు ఉబ్బరం, అసౌకర్యాన్ని తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో చేర్చడం జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**మూత్రపిండాల ఆరోగ్యం**

పొటాషియం, నీటి శాతం అధికంగా ఉండటం మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తుంది. కిడ్నీ స్టోన్స్ నివారణకు సహాయపడుతుంది. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగిస్తుంది. మూత్ర మార్గ ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రసం రూపంలో తీసుకోవడం ఈ ప్రయోజనాలను పెంచుతుంది.

**బరువు నిర్వహణ**

తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ కలిగి బరువు తగ్గడానికి అనువైనది. ఆకలిని నియంత్రిస్తుంది. ఎక్కువసేపు కడుపు నిండిన భావన కలిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేస్తుంది. ఆహారంలో సలాడ్‌గా, కూరగా చేర్చడం ప్రయోజనకరం.

**రక్తపోటు నియంత్రణ**

పొటాషియం రక్త నాళాలను సడలించి రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. యాంటీఆక్సిడెంట్స్ శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. రోజువారీ తీసుకోవడం హైపర్‌టెన్షన్‌ను నియంత్రిస్తుంది.

**ఉపయోగించే విధానాలు**

అరటి కాండాన్ని కూరగా, సలాడ్‌గా, రసంగా తీసుకోవచ్చు. రసం తయారీకి కాండాన్ని సన్నగా తరిగి, నీటితో కలిపి జ్యూసర్‌లో వేయండి. కొద్దిగా నిమ్మరసం, ఉప్పు కలపడం రుచిని పెంచుతుంది. కూరలో ఉల్లిపాయలు, మసాలాలతో కలిపి వండవచ్చు.

# వామ్మో ఏనుగు కలలో కనిపించిందా త్వరలో మీకు జరిగేది ఇదేనట



సాధారణంగానే మనందరికీ కలలు రావటం సహజం. అయితే, కొందరికీ కలలో పర్వతాలు .. నదులు .. అడవులు .. జంతువులు కనిపిస్తుంటాయి. అలాంటి కలల్లో అప్పుడప్పుడు పులులు .. సింహాలు, ఏనుగులు కూడా కనిపిస్తుంటాయి. అలాంటి జంతువులు కలలో కనిపించినప్పుడు సాధారణంగానే భయపడుతుంటారు. కొందరు ఆ కలను మరుసటి రోజు ఉదయం ఇతరులతో పంచుకుంటారు. మరికొందరు ఎదుటివారికి చెబితే ఏం జరుగుతుందోననే ఆందోళనకి లోనవుతుంటారు. అయితే కలలో ఏనుగు కనిపిస్తే ఏమౌతుందో తెలుసా..? స్వప్న శాస్త్రం ప్రకారం, కలలు అనేది కొన్ని సంకేతాలను తెలియజేస్తాని చెబుతారు. ఆయా కల ఆధారంగా మంచి, చెడు అంచనా వేస్తారు. కొందరికి కలలో ఏనుగు తరచుగా కనిపిస్తుంది. అయితే మీకు కలలో ఏనుగు వస్తే, మీ దశ తిరగనుందని అర్థం అంటున్నారు జ్యోతిశాస్త్ర నిపుణులు. మీరు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలన్నీ తొలగిపోతాయని అంటున్నారు. స్వప్న శాస్త్రం ప్రకారం, కలలు అనేది కొన్ని సంకేతాలను తెలియజేస్తాని చెబుతారు. ఆయా కల ఆధారంగా మంచి, చెడు అంచనా వేస్తారు. కొందరికి కలలో ఏనుగు తరచుగా కనిపిస్తుంది. అయితే మీకు కలలో ఏనుగు వస్తే, మీ దశ తిరగనుందని అర్థం అంటున్నారు జ్యోతిశాస్త్ర నిపుణులు. మీరు ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలన్నీ తొలగిపోతాయని అంటున్నారు.

**1 / 5**

కలలో ఏనుగు కనిపించటంతో ఏదో విధంగా మీకు ధనలాభం గోచరిస్తుందని అర్థం అంటున్నారు నిపుణులు. ఇలాంటి కలలు రావటం అంటే మీరు త్వరగా ధనవంతులు కాబోతున్నారని సంకేతం అంటున్నారు. లేదా మీకు ఎలాంటి ఆర్థిక సమస్యలు ఉండవని ముందుగా మీకు అందుతున్న శుభ సంకేతం అంటున్నారు. కలలో ఏనుగు కనిపించటంతో ఏదో విధంగా మీకు ధనలాభం గోచరిస్తుందని అర్థం అంటున్నారు నిపుణులు. ఇలాంటి కలలు రావటం అంటే మీరు త్వరగా ధనవంతులు కాబోతున్నారని సంకేతం అంటున్నారు. లేదా మీకు ఎలాంటి ఆర్థిక సమస్యలు ఉండవని ముందుగా మీకు అందుతున్న శుభ సంకేతం అంటున్నారు.

**2 / 5**

కలలో ఏనుగు కనిపిస్తే మంచిదేనని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏనుగు కుంభస్థలం .. లక్ష్మీదేవి నివాస స్థానంగా చెబుతారు. అందువలన కలలో ఏనుగు దర్శనం వలన సంపదలు లభిస్తాయని అంటారు. ఏనుగును దర్శించుకోవడం వలన దారిద్ర్యం .. దుఃఖం దూరమవుతాయని జ్యోతిశాస్త్ర నిపుణులు చెబుతున్నారు. కలలో ఏనుగు కనిపిస్తే మంచిదేనని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. ఏనుగు కుంభస్థలం .. లక్ష్మీదేవి నివాస స్థానంగా చెబుతారు. అందువలన కలలో ఏనుగు దర్శనం వలన సంపదలు లభిస్తాయని అంటారు. ఏనుగును దర్శించుకోవడం వలన దారిద్ర్యం .. దుఃఖం దూరమవుతాయని జ్యోతిశాస్త్ర నిపుణులు చెబుతున్నారు.

**3 / 5**

కలలో ఏనుగు కనిపించటం వల్ల వారి జీవితంలో శుభఫలితాలు కలుగుతాయని అంటున్నారు. వారికి జీవితలో అదృష్టం, ఐశ్వర్యం చేకూరతాయని నమ్ముతారు. అంతేకాదు.. ఏనుగును గజరాజు అంటారు. ఆ సాక్ష్యాత్తు ఆ వినాయకుడి ముఖం కూడా ఏనుగు. అందుకే కలలో ఏనుగు కనిపిస్తే అదృష్టంగా చెబుతారు. కలలో ఏనుగు కనిపించటం వల్ల వారి జీవితంలో శుభఫలితాలు కలుగుతాయని అంటున్నారు. వారికి జీవితలో అదృష్టం, ఐశ్వర్యం చేకూరతాయని నమ్ముతారు. అంతేకాదు.. ఏనుగును గజరాజు అంటారు. ఆ సాక్ష్యాత్తు ఆ వినాయకుడి ముఖం కూడా ఏనుగు. అందుకే కలలో ఏనుగు కనిపిస్తే అదృష్టంగా చెబుతారు.

**4 / 5**

అంతేకాదు.. ఆయా పుణ్య క్షేత్రాల్లో గజ వాహనంగా ఏనుగులు భగవంతుడి సేవలో తరిస్తుంటాయి. గజ ముఖంతోనే వినాయకుడు తొలి పూజలు అందుకుంటూ ఉంటాడు .. అందరి విఘ్నాలను తొలగిస్తూ ఉంటాడు. అలాంటి ఏనుగును కలలోనే కాదు .. బయట చూసినా ఆ ఇంటిల్లిపాదికి మంచి జరుగుతుందని నమ్ముతారు. అంతేకాదు.. ఆయా పుణ్య క్షేత్రాల్లో గజ వాహనంగా ఏనుగులు భగవంతుడి సేవలో తరిస్తుంటాయి. గజ ముఖంతోనే వినాయకుడు తొలి పూజలు అందుకుంటూ ఉంటాడు .. అందరి విఘ్నాలను తొలగిస్తూ ఉంటాడు. అలాంటి ఏనుగును కలలోనే కాదు .. బయట చూసినా ఆ ఇంటిల్లిపాదికి మంచి జరుగుతుందని నమ్ముతారు.వామ్మో.. ఏనుగు కలలో కనిపించిందా..? త్వరలో మీకు జరిగేది ఇదేనట..!



# అప్పులు లేవంటే.. అంతా బాగున్నట్టేనా

### కానే కాదంటున్న ఆర్థిక నిపుణులు

### ఈ విషయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచన!



ఒక మనిషిని ఆర్థికంగా కుంగదీయడంలో, మానసికంగా దెబ్బతీయడంలో అప్పులది మేజర్ రోల్. అప్పులు ఉన్నవారికే తెలుస్తుంది ఆ బాధ, ఒత్తిడి ఎలా ఉంటాయో! నిరంతరమైన ఆ టార్చర్ మనసును నిత్యం వేధిస్తుంటుంది. అందుకే, అప్పు లేనివారే అసలైన ధనవంతులు అని కూడా అంటుంటారు. ఇది ఒకరకంగా నిజమే. కానీ, అప్పులు లేనంత మాత్రానా అంతా బాగున్నట్టేనా అంటే.. "కాదు" అంటున్నారు ఆర్థిక నిపుణులు! మరి, అప్పులు లేకుండా ఉండడంతోపాటు ఇంకా ఏముండాలి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనేది ఇప్పుడు చూద్దాం.క్రెడిట్ కార్డు బాకీలు, బ్యాంకులో తీసుకున్న రుణాలు, వడ్డీవ్యాపారుల వద్ద తీసుకున్న నగదు.. ఇలాంటి అప్పులను పూర్తిగా చెల్లించడమనేది పెద్ద ఆర్థిక విజయమే. కానీ, రుణాలు తీర్చినంత మాత్రాన జీవితానికి ఆర్థిక భద్రత లభించినట్టు కాదంటున్నారు నిపుణులు! ఈ రోజుల్లో జీవన వ్యయం భారీగా పెరిగిపోయింది. జనాలకు అప్పులు లేకపోయినప్పటికీ.. నెలావారీ ఆర్థిక తిప్పలు మాత్రం దండిగానే ఉంటున్నాయి. ఇంటి అద్దె మొదలు, స్కూలు ఫీజులు, ఇన్సూరెన్స్ ప్రీమియం, ఈఎంఐలు, ఇతర చెల్లింపులు.. నెల జీతంలో మెజారిటీ వాటాను ఇవే తినేస్తున్నాయి. వీటిని భరించేందుకు జీతం మీదనే పూర్తిగా ఆధారపడాల్సి వస్తుంది. చాలా మంది నెలాఖరున అప్పులు చేసి, మళ్లీ జీతం రాగానే తిరిగి ఇస్తుంటారు. ఇలా.. వేరే పెద్ద పెద్ద అప్పులు లేకపోయినా.. జీవితాన్ని మాత్రం బొటాబొటిగా ఆర్థిక అత్తెసరు మార్కులతో పాసవుతూ నెల నెలా గడిపేస్తుంటారు. ఇలాంటప్పుడు అనుకోని ఖర్చులు పెరిగినా, ఊహించని సమస్యలు ఎదురైనా తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.బొటాబొటిగా సాగుతున్న జీవన విధానం ప్రస్తుతానికి బాగానే ఉంటుంది. కానీ.. ఒక దశ దాటిన తర్వాత నగర జీవన శైలికి అలవాటైపోతారు. కంఫర్ట్ లైఫ్ స్టైల్, బయట భోజనాలు, పార్టీలు, జర్నీలు వంటివి తగ్గించుకోవడం చాలా కష్టమవుతుంది. అప్పుడు ఇదే నెలవారీ ఆదాయంతో ముందుకు సాగడం ఇబ్బంది కావచ్చు. తగినంతగా పొదుపు చేస్తూ వెళ్లకపోతే, ఆదాయ మార్గాలు పెంచుకోకపోతే.. అప్పటి వరకూ కొనసాగించిన జీవన శైలే ఇబ్బందిగా మారే ఛాన్స్ ఉంది. ఈ పరిస్థితికి తోడు ఊహించని అవసరాలు వస్తే ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకోవాల్సి వస్తుంది.పైన చెప్పిన ఇబ్బందులు రాకుండా ఉండాలంటే ముందుగా అసలైన ఆర్థిక స్వేచ్ఛ ఏంటనేది తెలుసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కేవలం అప్పులు లేకుండా ఉండడం ఒక్కటే ఆర్థిక స్వేచ్ఛ ఉందని చెప్పడానికి కొలమానం కాదంటున్నారు. సరిపడా పొదుపు చేయాలి, ఖర్చుల నియంత్రణ కూడా మన చేతుల్లోనే ఉండాలని చెబుతున్నారు. వచ్చే ఆదాయానికి, చేసే ఖర్చులకు మధ్య స్పష్టమైన వ్యత్యాసం ఉండటమే అసలైన ఆర్థిక స్వేచ్ఛ అని అంటున్నారు.అకస్మాత్తుగా ఉద్యోగం కోల్పోవాల్సి వస్తే, కొన్నాళ్లపాటు ఆదాయం లేకున్నా కూడా ఒత్తిడికి గురికాకుండా ఉండగలగాలి. ఆర్థిక కష్టాలను ఈజీగా ఫేస్ చేయగలగాలి. అప్పుడే ఆర్థికంగా బలంగా ఉన్నట్టుగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. అంతే తప్ప, కేవలం అప్పుల్లేకుండా ఉంటేనే బలంగా ఉన్నట్టు కాదని అంటున్నారు. మరి, మీరు ఎంత బలంగా ఉన్నారో ఒకసారి చెక్ చేసుకుంటారా.

# పశ్చిమాసియా యుద్ధం వేళ భారత్ ముందడుగు

### విదేశీ పెట్టుబడులను ఆకర్షించే దిశగా ట్యాక్స్ రద్దు!

### విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్రం కీలక నిర్ణయం!

### ఎఫ్‌పీఐల ప్రభుత్వ సెక్యూరిటీల పెట్టుబడులపై క్యాపిటల్ గెయిన్స్ పన్ను రద్దు

### ఆర్డినెన్స్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపినట్లు సమాచారం



పశ్చిమాసియా యుద్ధం వేళ భారత ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒత్తిళ్లకు గురవుతోంది. ఈ నేపథ్యంలో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాలను తగ్గించడంపై కేంద్ర ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. సంక్షోభాన్ని అవకాశంగా మల్చుకోవడంపై దృష్టి సారించింది. దీంతో ఇప్పుడు దేశంలోకి విదేశీ విధులను మళ్లించేందుకు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు భారత ప్రభుత్వ సెక్యూరిటీల్లో చేసే పెట్టుబడులపై క్యాపిటల్ గెయిన్స్ పన్నును పూర్తిగా రద్దు చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.అందుకు సంబంధించిన ఆదాయపు పన్ను చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఆ నిర్ణయం అమల్లోకి రానుంది. ప్రస్తుతం విదేశీ పెట్టుబడిదారులు 12 నెలలకుపైగా ఉంచిన బాండ్లు, లిస్టెడ్ షేర్లపై వచ్చే దీర్ఘకాలిక మూలధన లాభాలపై 12.5 శాతం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ప్రభుత్వ బాండ్లపై పొందే వడ్డీ ఆదాయంపై 20 శాతం విత్‌హోల్డింగ్ ట్యాక్స్ కూడా వర్తిస్తోంది. గతంలో ఈ వడ్డీ ఆదాయంపై 5 శాతం రాయితీ పన్ను రేటు ఉండేది. అయితే 2023లో కేంద్రం ఆ సడలింపును ఉపసంహరించుకుంది.ఇటీవలి కాలంలో భారత మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ భారీ స్థాయిలో కొనసాగుతోంది. ఈ ఏడాది మాత్రమే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (ఎఫ్ఐఐలు), ఎఫ్‌పీఐలు కలిపి సుమారు రూ.2.5 లక్షల కోట్ల విలువైన ఈక్విటీ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నట్లు అంచనాలు చెబుతున్నాయి. దీంతో రూపాయిపై ఒత్తిడి పెరగడంతో పాటు మార్కెట్లలో అస్థిరత నెలకొంది. ఈ నేపథ్యంలో విదేశీ పెట్టుబడిదారులకు పన్ను పరమైన ఊరట కల్పించాలన్న డిమాండ్లు పెరిగాయి.ప్రభుత్వం తీసుకుంటున్నట్లు తాజా నిర్ణయం ప్రధానంగా ప్రభుత్వ బాండ్ల మార్కెట్‌లో విదేశీ పెట్టుబడులను పెంచడమే లక్ష్యంగా ఉన్నట్లు తెలుస్తోంది. విదేశీ పెట్టుబడిదారులకు క్యాపిటల్ గెయిన్స్ పన్ను భారం లేకపోవడం వల్ల భారత ప్రభుత్వ సెక్యూరిటీలు మరింత ఆకర్షణీయంగా మారే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీనివల్ల దేశంలోకి డాలర్ల ప్రవాహం పెరిగి విదేశీ మారక నిల్వలకు మద్దతు లభించవచ్చని భావిస్తున్నారు.అయితే విదేశీ పెట్టుబడుల ఉపసంహరణను కేవలం ఎల్‌టీసీజీ పన్నుతో మాత్రమే అనుసంధానించలేమంటున్నారు నిపుణులు. పన్ను విధానం కూడా ఒక ముఖ్యమైన కారణమని చెప్పారు. ముఖ్యంగా సార్వభౌమ సంపద నిధులు, పెన్షన్ ఫండ్లు వంటి సంస్థలకు భారతదేశంలో చెల్లించాల్సిన ఎల్‌టీసీజీ పన్ను అదనపు వ్యయంగా మారుతుందని, ఇతర దేశాల్లో లభించే పన్ను రాయితీలు ఇక్కడ అందుబాటులో లేకపోవడం వల్ల భారత మార్కెట్ కొంత ఖరీదైనదిగా కనిపిస్తోందని వివరించారు. సింగపూర్, హాంకాంగ్ వంటి ప్రధాన అంతర్జాతీయ ఆర్థిక కేంద్రాల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులపై సాధారణంగా క్యాపిటల్ గెయిన్స్ పన్ను ఉండదని పేర్కొన్నారు. అయితే భారతదేశం మాత్రం దేశీయ ఆస్తుల ద్వారా వచ్చే ఆదాయం దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రయోజనం చేకూరాలనే ఉద్దేశంతో పన్ను విధానాన్ని అమలు చేస్తోందన్నారు.ఇక పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, ఇరాన్‌కు సంబంధించిన భౌగోళిక రాజకీయ పరిణామాలు, ముడి చమురు ధరల పెరుగుదల కూడా భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. చమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి వ్యయం పెరిగి ద్రవ్యోల్బణం, కరెంట్ అకౌంట్ లోటు వంటి అంశాలపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విదేశీ మూలధన ప్రవాహాలను పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు బలం చేకూర్చాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా దీర్ఘకాలిక, స్వల్పకాలిక మూలధన లాభాల పన్నుల తగ్గింపుపై పెట్టుబడిదారుల అభిప్రాయాలను వినేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. 2024 జూలైలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో ఎక్కువ శాతం ఆస్తులపై ఎల్‌టీసీజీ పన్ను రేటును 10 శాతం నుంచి 12.5 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. అయితే లిస్టెడ్ ఈక్విటీ, ఈక్విటీ లింక్డ్ ఇన్‌స్ట్రుమెంట్లపై మినహాయింపు పరిమితిని రూ.1.25 లక్షలకు పెంచారు.మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం ప్రభుత్వ బాండ్లపై క్యాపిటల్ గెయిన్స్ పన్ను రద్దు నిర్ణయం విదేశీ పెట్టుబడిదారులకు సానుకూల సంకేతాలను పంపే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ రుణ మార్కెట్‌లో విదేశీ భాగస్వామ్యం పెరగడమే కాకుండా రూపాయి స్థిరీకరణకు కూడా కొంత మేర సహకారం లభించవచ్చని నిపుఉలు భావిస్తున్నారు. అదే సమయంలో ఇది విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించే చర్యలలో తొలి అడుగు మాత్రమే కావచ్చని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని పన్ను సడలింపులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన సంస్కరణలు తీసుకురావడంపై కూడా కేంద్రం ఆలోచిస్తున్నట్లు సమాచారం.

# బంగారం కొనాలనుకునేవారికి ఊరట

### దేశీయ మార్కెట్‌లో తగ్గుముఖం పట్టిన బంగారం, వెండి ధరలు



బంగారం, వెండి కొనుగోలు చేయాలని భావిస్తున్న వినియోగదారులకు శుక్రవారం కొంత ఊరట లభించింది. గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతున్న పసిడి ధరలు తాజాగా తగ్గుముఖం పట్టగా, వెండి ధరల్లోనూ గణనీయమైన తగ్గుదల నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు తగ్గినట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.క్యాప్స్ గోల్డ్ వెబ్‌సైట్ వెల్లడించిన వివరాల ప్రకారం, హైదరాబాద్‌లో శుక్రవారం ఉదయం 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,58,320గా నమోదైంది. ఇదే సమయంలో విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,58,240 వద్ద ట్రేడవుతోంది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఈ ధర రూ.1,58,840గా ఉండగా, ఒక్కరోజులోనే రూ.500కు పైగా తగ్గుదల నమోదైంది.ఇక 22 క్యారెట్ల బంగారం ధర కూడా తగ్గింది. ప్రస్తుతం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం రూ.1,43,090 వద్ద లభిస్తోంది. అలాగే 18 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,17,070గా నమోదైంది. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్‌లో బంగారం ధరలు తగ్గడం కొనుగోలుదారులకు అనుకూలంగా మారిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి.వెండి ధరల్లోనూ గణనీయమైన మార్పు కనిపించింది. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ప్రొద్దుటూరు మార్కెట్లలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,61,200గా ఉంది. గత ట్రేడింగ్ సెషన్‌లో ఇదే ధర రూ.2,62,950గా నమోదైంది. దీంతో ఒక్కరోజులోనే కిలో వెండి ధర రూ.1,700కుపైగా తగ్గినట్లు మార్కెట్ గణాంకాలు సూచిస్తున్నాయి. పరిశ్రమల అవసరాలు, అంతర్జాతీయ డిమాండ్, పెట్టుబడిదారుల ధోరణులు వెండి ధరలపై ప్రభావం చూపుతాయని నిపుణులు పేర్కొంటున్నారు.అయితే బంగారం కొనుగోలు చేసే సమయంలో కేవలం ధరను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం సరిపోదని నిపుణులు సూచిస్తున్నారు. బంగారం స్వచ్ఛతను కూడా తప్పనిసరిగా పరిశీలించాలని చెబుతున్నారు. సాధారణంగా బంగారం నాణ్యతను క్యారెట్ల ఆధారంగా నిర్ణయిస్తారు. 24 క్యారెట్ల బంగారం దాదాపు 99.9 శాతం స్వచ్ఛత కలిగి ఉంటుంది. ఇది అత్యంత శుద్ధమైన బంగారంగా పరిగణించబడుతుంది. అయితే ఇది చాలా మెత్తగా ఉండటంతో నగల తయారీలో సాధారణంగా ఉపయోగించరు. బంగారు నాణేలు, బిస్కెట్లు, పెట్టుబడి ఉత్పత్తుల తయారీలో మాత్రం 24 క్యారెట్ల బంగారానికే ప్రాధాన్యం ఉంటుంది.మరోవైపు 22 క్యారెట్ల బంగారంలో స్వల్పంగా వెండి, రాగి వంటి ఇతర లోహాలను కలుపుతారు. దీంతో అది మరింత బలంగా మారి ఆభరణాల తయారీకి అనుకూలంగా ఉంటుంది. అందుకే భారత మార్కెట్‌లో ఎక్కువగా 22 క్యారెట్ల బంగారంతో తయారైన నగలే విక్రయిస్తుంటారు. ముఖ్యంగా 916 హాల్‌మార్క్ ఉన్న బంగారం 22 క్యారెట్ల నాణ్యతకు గుర్తుగా భావిస్తారు. కాబట్టి బంగారం కొనుగోలు సమయంలో హాల్‌మార్క్ గుర్తు ఉందో లేదో వినియోగదారులు తప్పనిసరిగా పరిశీలించాలని నిపుణులు సూచిస్తున్నారు.అలాగే బంగారం కొనుగోలు చేసే సమయంలో ప్రకటించే ధర మాత్రమే తుది ధర కాదని గుర్తుంచుకోవాలి. సాధారణంగా బంగారం గ్రాము లేదా 10 గ్రాముల ప్రాథమిక ధరను మాత్రమే ప్రకటిస్తారు. కానీ వినియోగదారుడు చెల్లించాల్సిన మొత్తం మాత్రం అంతకంటే ఎక్కువగా ఉండవచ్చు. ఎందుకంటే బంగారం ధరకు అదనంగా జీఎస్‌టీ, మేకింగ్ ఛార్జీలు, హాల్‌మార్కింగ్ ఫీజు, ఇతర పన్నులు కూడా జత అవుతాయి.అంతేకాకుండా ప్రతి నగల దుకాణంలో మేకింగ్ ఛార్జీలు వేర్వేరుగా ఉండే అవకాశం ఉంటుంది. కొన్ని చోట్ల తరుగు రేట్లు కూడా భిన్నంగా ఉండవచ్చు. అందువల్ల కేవలం బంగారం ధర తగ్గిందనే కారణంతో కొనుగోలు నిర్ణయం తీసుకోవడం కంటే, పూర్తి బిల్లును పరిశీలించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. బిల్లులో పేర్కొన్న ప్రతి అంశాన్ని అర్థం చేసుకుని, నాణ్యత ధ్రువీకరణ ఉన్న ఆభరణాలను మాత్రమే కొనుగోలు చేయాలని చెబుతున్నారు.

# ఆర్బీఐ కీలక నిర్ణయం- వడ్డీ రేట్లు యథాతథం

### వరుసగా మూడోసారి

### ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాల ప్రకటన

### కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన ఆర్బీఐ





దేశ ఆర్థిక వ్యవస్థ ముందున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకుని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి కీలక వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించింది. ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించారు. రెపో రేటును 5.25 శాతం వద్దనే కొనసాగించాలని కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో వరుసగా మూడో సమీక్షలోనూ వడ్డీ రేట్లలో ఎలాంటి మార్పు చోటుచేసుకోలేదు.రెపో రేటు యథాతథంగా ఉండటంతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ (ఎస్‌డీఎఫ్) రేటు 5 శాతంగా, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ (ఎంఎస్ఎఫ్), బ్యాంకు రేట్లు 5.5 శాతంగా కొనసాగనున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడం, మరోవైపు ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచడం మధ్య సమతుల్యత అవసరమని ఆర్‌బీఐ అభిప్రాయపడింది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనిశ్చిత పరిస్థితులను ఎదుర్కొంటోందని గవర్నర్ సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, ఇంధన ధరల పెరుగుదల, సరఫరా వ్యవస్థలలో అంతరాయాలు, అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో సమస్యలు ప్రపంచ వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయని వివరించారు. అయినప్పటికీ, గతంలో ఇలాంటి సంక్షోభాలను ఎదుర్కొన్న సందర్భాలతో పోలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం మరింత బలమైన స్థితిలో ఉందన్నారు. అయితే, అంతర్జాతీయ పరిణామాల ప్రభావం నుంచి పూర్తిగా బయటపడలేమని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఇంధన ధరలు పెరగడం, ఇతర ముడి సరుకుల ధరల భారం, సరఫరా గొలుసులలో అంతరాయాలు దేశీయ ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపే అవకాశముందని పేర్కొంది. ఈ నేపథ్యంలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను గతంలో ప్రకటించిన 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది.త్రైమాసికాల వారీగా చూస్తే తొలి త్రైమాసికంలో 6.6 శాతం, రెండో త్రైమాసికంలో 6.3 శాతం, మూడో త్రైమాసికంలో 6.5 శాతం, నాలుగో త్రైమాసికంలో 6.8 శాతం వృద్ధి నమోదవుతుందని ఆర్‌బీఐ అంచనా వేసింది. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు ఇప్పటికీ స్థిరంగా కొనసాగుతున్నాయని, తయారీ, సేవారంగాలు ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొంటున్నాయని గవర్నర్ తెలిపారు. డిమాండ్ పరంగా ప్రైవేట్ వినియోగం బలంగా కొనసాగుతోందని ఆర్‌బీఐ పేర్కొంది. పెట్టుబడుల వ్యయం కూడా ఊపందుకున్నట్లు తెలిపింది. వస్తు ఎగుమతులు అధిక రవాణా, బీమా ఖర్చుల మధ్య కూడా వృద్ధిని నమోదు చేశాయని, సేవల ఎగుమతులు కూడా సానుకూల ధోరణిలో ఉన్నాయని వివరించింది. భారత సేవలకు అంతర్జాతీయంగా డిమాండ్ కొనసాగుతుండటం ఊరటనిచ్చే అంశమని పేర్కొంది.ఇక ద్రవ్యోల్బణం విషయంలో మాత్రం ఆర్‌బీఐ కొంత ఆందోళన వ్యక్తం చేసింది. ఇంధన ధరల పెరుగుదలతో పాటు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటంతో ఆహార ధరలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. ఈ కారణంగా 2026-27 ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణ అంచనాను 4.6 శాతం నుంచి 5.1 శాతానికి పెంచింది. అయితే దేశంలో ఆహార ధాన్యాల నిల్వలు తగిన స్థాయిలో ఉండటం సానుకూల అంశమని ఆర్‌బీఐ పేర్కొంది. ఆహార సరఫరాలో పెద్ద అంతరాయాలు లేకపోతే ధరల పెరుగుదల కొంత మేర నియంత్రణలో ఉండే అవకాశం ఉందని తెలిపింది.విదేశీ పెట్టుబడులను మరింత ఆకర్షించేందుకు కూడా కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు గవర్నర్ వెల్లడించారు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను సరళీకరించినట్లు చెప్పారు. అలాగే ఈక్విటీ మార్కెట్‌లో ఎన్ఆర్ఐలు, ఓవర్సీస్ సిటిజన్ల పెట్టుబడి పరిమితులను పెంచినట్లు తెలిపారు. దీంతో భారత మార్కెట్లలో విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. రూపాయి మారకపు విలువ విషయంలో ఆర్‌బీఐ విధానంలో ఎలాంటి మార్పు లేదని సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. రూపాయికి నిర్దిష్ట విలువను నిర్ణయించే విధానాన్ని ఆర్‌బీఐ అనుసరించడం లేదని, మార్కెట్ పరిస్థితుల ఆధారంగానే మారకపు విలువ ఉంటుందని తెలిపారు.

# దివాలా తీసిన తర్వాతా క్రెడిట్ స్కోరు పెంచుకోవచ్చు!

### భారీగా పడిపోయిన సిబిల్ స్కోర్‌ను పునర్నిర్మించుకోవచ్చు

### కొన్ని టిప్స్ సూచిస్తున్న ఆర్థిక నిపుణులు




బ్యాంకులు లేదా రుణ సంస్థల నుంచి తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించలేమంటూ.. ఒక వ్యక్తి లేదా సంస్థ చట్టపరంగా ప్రకటించడాన్నే 'దివాలా' అంటారు. బిజినెస్‌లో భారీ నష్టాలు రావడం కావచ్చు. ఉద్యోగం కోల్పోవడం కావచ్చు. లేదంటే ప్రమాదాలు, తీవ్ర అనారోగ్యమూ కావచ్చు. ఈ కారణాలవల్ల ఆర్థికంగా చితికిపోయినప్పుడు కోర్టు ద్వారా దివాలా తీసినట్టు ప్రకటించుకుంటారు. ఇలా దివాలా తీసిన వ్యక్తి ఆ తర్వాత రుణాలు పొందడం చాలా కష్టమవుతుంది. కానీ, పూర్తిగా అసాధ్యం మాత్రం కాదు అంటున్నారు ఆర్థిక నిపుణులు! లాంగ్ టర్మ్‌లో క్రెడిట్ స్కోరును తిరిగి పెంచుకునే అవకాశం కూడా ఉంటుందని చెబుతున్నారు. మరి, ఆ వివరాలేంటో ఇప్పుడు చూద్దాం.దివాలా ప్రకటిస్తే క్రెడిట్ స్కోరు భారీగా పతనమైపోతుంది. ఈ రికార్డు మీ క్రెడిట్ రిపోర్టులో దాదాపు 10 సంవత్సరాల వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఆ తర్వాతే తొలగిపోతుందట. ఎంత తగ్గుతుందనేది మీ స్కోరు మీద ఆధారపడి ఉంటుంది. 130 పాయింట్ల నుంచి 240 పాయింట్ల వరకు తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. కొన్నిసార్లు 500 కంటే దిగువకు స్కోరు పడిపోవచ్చని అంటున్నారు.దివాలా రికార్డు ఉన్నప్పటికీ, వెంటనే సరైన పద్ధతి పాటిస్తే క్రెడిట్‌ను మెరుగుపరుచుకోవడం కాలక్రమేణా సాధ్యపడుతుందని చెబుతున్నారు. సెక్యూర్డ్ క్రెడిట్ కార్డ్ తీసుకోవచ్చు. ఇది బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ ఆధారంగా లభించే కార్డు. మీ ఎఫ్‌డీ మొత్తంలో కొంత శాతాన్ని క్రెడిట్ లిమిట్‌గా ఇస్తారు. ఈ కార్డును బాధ్యతాయుతంగా వాడుతూ, బిల్లులను సకాలంలో చెల్లించడం ద్వారా క్రెడిట్ స్కోరును నెమ్మదిగా పెంచుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.దివాలా తీసిన ఒకటి రెండేళ్ల తర్వాత, ఈజీగా తిరిగి చెల్లించగలిగే చిన్న రుణాలు తీసుకోండి. వీటి ఈఎంఐలను గడువులోగా కట్టడం వల్ల మీ క్రెడిట్ ప్రొఫైల్ మెరుగవుతుందని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.ఆర్థిక ఇబ్బందులు వచ్చాయని పాత కార్డులను రద్దు చేయవద్దని చెబుతున్నారు. వాటిని యాక్టివ్‌గా ఉంచి, బకాయిలను సకాలంలో చెల్లిస్తుంటే స్కోరు త్వరగా కోలుకుంటుందట.ఒకవేళ మీకు రుణం ఇవ్వడానికి బ్యాంకులు సందేహిస్తే.. మంచి క్రెడిట్ స్కోర్ ఉన్న వ్యక్తిని సహ-సంతకందారుగా పెట్టుకోవడం ద్వారా లోన్ ఆమోదం పొందే అవకాశాలు పెరుగుతాయి.క్రెడిట్ స్కోరు వెంటనే పెంచుకోవాలనే ఆరాటంలో.. మోసాలకు గురి కావద్దని హెచ్చరిస్తున్నారు. రాత్రికి రాత్రే స్కోరు పెంచడం సాధ్యం కాదని చెబుతున్నారు.దివాలా తర్వాత 2 సంవత్సరాలలో మీ క్రెడిట్ స్కోరును 650 పాయింట్ల పైకి చేర్చవచ్చని, నాలుగేళ్లలో 750o కి తీసుకువెళ్లవచ్చని సూచిస్తున్నారు.

